

విద్యుదాఘాతంతో కూలీ మృతి

కాటారం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో సెంట్రింగ్ కూలీ మృతి చెందిన సంఘటన మండలంలోని గంగారంలో శనివారం చోటుచేసుకుంది. భూపాలపల్లి మండలం కమలాపూర్ గ్రామానికి చెందిన గురుకుంట్ల అశోక్ (35) కాటారం మండలం గంగారంలో కుటుంబం సహా నివసిస్తున్నాడు. ఇళ్ల నిర్మాణ పనుల్లో భాగంగా చేసే సెంట్రింగ్ పనులు చేయడానికి అతడు కూలీగా వెళ్లగా యంత్రంతో ఐరన్ రాడ్స్ కట్ చేస్తుండగా విద్యుత్ వైరు తగిలి షాక్‌కు గుర య్యాడు. అతడిని ఆస్పత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు తెలిపారు.



కాజీపేటలో రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌ను పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

ఓరుగల్లుకు కొత్త వెలుగులు

- యూఐడీఎఫ్ పథకం ద్వారా రూ.412కోట్లు.. రామప్ప అభివృద్ధికి రూ.148కోట్లు
- పీఎం మిత్ర పథకం ద్వారా కాకతీయ టెక్స్‌టైల్ పార్కుకు రూ.200కోట్లు
- ఇప్పటికే రూ.30కోట్లు విడుదల... మరో రూ.30కోట్లు ఇస్తాం
- భూమిని అప్పగిస్తే త్వరలోనే వరంగల్ ఎయిర్‌పోర్టు పూర్తి చేస్తాం
- తొలుత ఏటీఆర్ విమానాలు.. స్పందనను బట్టి పెద్ద విమానాలు
- వచ్చే ఏడాది కాజీపేటలో రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ ప్రారంభం
- స్థానికులకే ఉద్యోగావకాశాలు.. ఆర్ఎంయూతో వరంగల్‌కు కొత్త పరిశ్రమలు వచ్చే ఛాన్స్
- హైదరాబాద్‌ను మెగా నగరంగా మార్చారు.. మరి వరంగల్‌పై వివక్ష ఎందుకు?
- కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి

స్మార్ట్ సిటీ, హృదయ్, హెరిటేజ్, అమృత్ పథకాలతో వరంగల్ నగరాభివృద్ధి



వరంగల్ రైల్వే స్టేషన్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

వరంగల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఓరుగల్లు అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిరంతర కృషి చేస్తుందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. వరంగల్ నగరంలో శనివారం వివిధ అభివృద్ధి పనులను పరిశీలించి, ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు. అనంతరం హరిత హోటల్‌లో జరిగిన మీడియా సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు.

అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ స్కీం (యూఐటీఎస్) కింద వరంగల్ నగరానికి రూ.412కోట్లు కేటాయించినట్లుగా కిషన్‌రెడ్డి తెలిపారు. ఈ పథకం ద్వారా నగరంలో చేపట్టబోయే పనులపై అధికారులతో సమీక్షించినట్లు తెలిపారు. స్మార్ సిటీ పథకం కింద రూ.274కోట్లతో రంగసముద్రం, చిన్నవడ్డేపల్లి చెరువుల వద్ద సుందరీకరణ పనులు పూర్తి చేయాల్సి ఉందని, గడువులోగా పనులన్నీ పూర్తి చేయాలని అధికారులకు సూచించినట్లు మంత్రి తెలిపారు. అలాగే పురాతన, చారిత్రాత్మక అలయాల అభివృద్ధి కోసం హృదయ్ పథకం కింద రూ.33కోట్లు కేటాయించామని, వీటితో ఘనపూర్ దేవాలయం, పద్మాక్షి ఆలయం, కాజీపేట దర్గాతో పాటు అనేక అలయాలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. యునేస్కో గుర్తింపు పొందిన రామప్ప అలయ అభివృద్ధికి రూ.148కోట్లు కేటాయించామన్నారు. ప్రధాన ఆలయంతో పాటు చిన్నచిన్న ఆలయాలను పునరుద్ధరిస్తున్నామని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. అమృత్ పథకం కింద కాజీపేట రైల్వేస్టేషన్‌ను రూ.274కోట్లతో ఆధునీకరిస్తున్నామని వివరించారు. వరంగల్ కోట భూములు ఆక్రమణకు గురవుతున్నాయని ఆరోపించారు. ఇప్పటికే (మిగతా 7వ పేజీలో)



హనుమకొండలో వేయిస్తంభాల గుడిలో కల్యాణ మండపం పనుల పురోగతిపై చర్చిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

పరిశీలిస్తూ.. సూచనలిస్తూ.. సమీక్షిస్తూ..

నగరంలో 8గంటల పాటు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పర్యటన 7

జోరుగా తొలి పర్వం



- చివరి రోజు భారీగా దాఖలైన పంచాయతీ నామినేషన్లు
- అర్ధరాత్రి వరకు కొనసాగిన ప్రక్రియ
- భూపాలపల్లి జిల్లాలోని నాలుగు మండలాల్లో మొదటి విడత ఎన్నికలు

కృష్ణకాలనీ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లాలో మొదలైన స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగుతోంది. ఈ నెల 27న ప్రారంభమైన తొలి విడత నామినేషన్ల పర్వం శనివారంతో ముగిసింది. గణపురం, రేగొండ, కొత్తపల్లిగోరి, మొగుళ్లపల్లి మండలాల్లో మొదటి విడత పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. నాలుగు మండలాల్లో మొత్తంగా 82 సర్పంచ్ స్థానాలకు, 712 వార్డు స్థానాలకు నామినేషన్ల ప్రక్రియ సాగింది. రాత్రి 10 గంటలకు గణపురం, రేగొండ మండలాలు నామినేషన్ల పర్వం ముగియగా, కొత్తపల్లిగోరి, మొగుళ్లపల్లి మండలాలకు అర్ధరాత్రి దాటినా పూర్తి కాలేదు. నామినేషన్ల సమర్పించేందుకు అభ్యర్థులకు ముందస్తుగా టోకెన్లు ఇవ్వడంతో రాత్రి వరకూ వేచి ఉండాల్సి వచ్చింది.

తొలి విడత నామినేషన్లు ఇలా..

తొలి విడుతల ఎన్నికలు గణపురం, రేగొండ, కొత్తపల్లిగోరి, మొగుళ్లపల్లిలో జరగనుండగా వీటిలో గణపురం మండలంలో మొత్తం 17 సర్పంచ్ స్థానాలు ఉండగా మొదటి రోజు ఆరుగురు, రెండో రోజు ఎనిమిది మంది, మూడో రోజు 102 మంది నామినేషన్లు వేశారు. అదే మండలంలో మొత్తం 158 వార్డు స్థానాలు ఉండగా తొలి రోజు ఇద్దరు, రెండో రోజు 14, మూడో రోజు 371 మంది నామినేషన్లు వేశారు. రేగొండ మండలంలో మొత్తంగా 23 సర్పంచ్ స్థానాలు ఉండగా తొలి రోజు 15, రెండో రోజు 14, మూడో రోజు 167 మంది సర్పంచ్ నామినే షన్లు దాఖలు చేశారు. ఇదే మండలంలో 214 వార్డు స్థానాలు ఉండగా తొలి రోజు7, రెండో రోజు14, మూడో రోజు 523 మంది వార్డు స్థానాలకు నామినేషన్లు దాఖలు చేశారు. కొత్తపల్లిగోరి మండలంలో 16 సర్పంచ్ స్థానాలకు 78 మంది నామినేషన్లు వేశారు. 128 వార్డులుండగా 304 మంది నామినేషన్లు వేశారు.

తొలి విడత 11న పోలింగ్..

తొలివిడతలో నామినేషన్ పూర్తయిన గణపురం, రేగొండ, కొత్తపల్లిగోరి, మొగుళ్లపల్లి మండలాల్లో డిసెంబరు 11న ఎన్నికల పోలింగ్ ఉండనుంది. ఆదివారం నామినేషన్ల పరిశీలన, చెల్లుబాటైన నామినేషన్ల ప్రకటన ఉండనుం ది. డిసెంబరు 1న అభ్యంతరాల స్వీకరణ, ఇదే రోజు తిరస్కరణ, 3న ఉపసంహరణ, ఉపసంహరణకు గడువు, 11న పోలింగ్ అదే ఫలితాలు వెల్లడికానున్నాయి.

నేటి నుంచే రెండో విడత

పంచాయతీ రెండో విడత నామినేషన్ల ప్రక్రియ చిట్యాల, టేకుమట్ల, భూపాల పల్లి, పలిమెల మండలాలకు నామినే షన్ల ప్రక్రియ కొనసాగనుంది. ఆదివారం వారాంతపు సెలవు అయినప్పటికీ అధికారులు అందుబాటులో ఉండి స్వీకరించనున్నారు.

భారీగా నామినేషన్లు

- మొదటి విడతలో చివరి రోజు అత్యధికంగా దాఖలు
- సర్పంచ్ స్థానాలకు 275, వార్డుల మెంబర్లకు 913
- ఆలస్యంగా కొనసాగిన ప్రక్రియ
- నేటి నుంచి రెండో విడత ప్రారంభం
- సిద్ధమైన యంత్రాంగం

వివరాలు 8వ పేజీలో..



మహా జాతరలో మెరుగైన వైద్య సేవలు అందించాలి

డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ రవీందర్ నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న రవీందర్‌నాయక్

ములుగు కలెక్టరేట్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది జనవరిలో అత్యంత వైభవంగా జరిగే మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతరకు తరలివచ్చే భక్తులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని హైదరాబాద్ డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్, ఫ్యామిలీ వెల్ఫేర్ అధికారి డాక్టర్ రవీందర్ నాయక్ సూచించారు. ములుగు కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉమ్మడి వరంగల్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో ఆయన శనివారం సమావేశమయ్యారు. మేడారం మహాజాతర సందర్భంగా చేపట్టాల్సిన వైద్య సేవలపై చర్చించారు. మహాజాతరలో మెరుగైన వైద్యసేవల కోసం వైద్యులను వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి, ములుగు, భూపాలపల్లి జనరల్ హాస్పిటల్స్ నుంచి రప్పించి డిసెంబరు 25నుంచి ఫిబ్రవరి 10 వరకు అందుబాటులో ఉంచుతామన్నారు. అదేవిధంగా ఉచితంగా వైద్యశిబిరాలు నిర్వహిస్తామన్నారు. డిసెంబరు 25నుంచి 31 వరకు రోజుకు మూడు క్యాంపులు, జనవరి 1నుంచి 18 వరకు రోజుకు 10, 19నుంచి 27 వరకు రోజుకు 20 క్యాంపులు, 28 నుంచి 31వరకు రోజుకు 72 క్యాంపులు, ఫిబ్రవరి 1నుంచి 10 వరకు జాతర అనంతర క్యాంపులు నిర్వహిస్తామని వివరించారు. ఈ వైద్యశిబిరాలలో 340 రకాల మందులు, సర్జికల్ పరికరాలను సమకూర్చుకుంటామని, దీంతోపాటు 108 అంబులెన్స్‌లు 19, బైక్ అంబులెన్స్ 40 ఉపయోగించుకుంటామని అన్నారు. ఫస్ట్ రిఫెరల్ సర్వీసుల కోసం తాడ్వాయి ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని, సెకండ్ రిఫెరల్ సేవల కోసం జీజీహెచ్ ఏటూరునాగారం, ములుగు ఆస్పత్రులు, వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిని ఉపయోగించుకుంటామని అన్నారు. నిపుణులైన వైద్యులు, వైద్యాధికారులు పారామెడికల్ సిబ్బంది, రాపిడ్ రెస్పాన్స్ టీంలు, సపోర్టింగ్ సిబ్బంది జాతరలో విధులు నిర్వర్తిస్తారని తెలిపారు. ఔషధాల నిల్వలు, వ్యాధి పర్యవేక్షణ వ్యవస్థ బలోపేతంపై కూడా దృష్టి పెడతామన్నారు. ఈ సమావేశంలో ఉమ్మడి వరంగల్ డీఎంహెచ్‌వోలు గోపాల్‌రావు, అప్పయ్య, సాంబశివరావు, మధుసూదన్, మల్లికార్జున్, రవిరాథోడ్, ప్రసాద్, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు విపిన్‌కుమార్, క్రాంతి కుమార్, ప్రోగ్రాం అధికారులు పవన్‌కుమార్, శ్రీకాంత్, సిబ్బంది సంపత్, దుర్గారావు, ప్రసాద్, వెంకటపతిరాజు, వెంకటరెడ్డి, సురేష్‌బాబు, భూపాల్‌రెడ్డి, పీహెచ్‌సీలు, ఆర్బీఎస్కే వైద్యులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రైతు హక్కుల రక్షణకు నూతన విత్తన చట్టం

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ



కలెక్టరేట్‌లో జరిగిన సమావేశాల్లో పాల్గొని మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రైతుల హక్కులను పరిరక్షించడమే లక్ష్యంగా నూతన విత్తన చట్టం ముసాయిదాను ప్రతిపాదించామని కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. కలెక్టరేట్ కార్యాలయంలో శనివారం నూతన విత్తన చట్టం-2025 ముసాయిదాపై వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పోలీసు, ఉద్యాన శాఖల అధికారులు, విత్తన కంపెనీలు, ఇన్పుట్ డీలర్లు, రైతుల ఉత్పత్తి సంఘాల నేతలు, అనుబంధ సంస్థల ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు. విత్తన చట్టం ముసాయిదాపై చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు సలహాలు, సూచనలు అందించాలని సూచించారు. వాణిజ్య ప్రక్రియ సరళీకరణ నిబంధనల ఉల్లంఘన జరిగినప్పుడు కఠినమైన శిక్షలు ఉంటాయని తెలిపారు. నాణ్యత నియంత్రణ చర్యలు వంటి అంశాలను ఈ చట్టంలో స్పష్టంగా పొందుపరిచినట్లు తెలిపారు. పార్లమెంటులో ఈ చట్టాన్ని ఆమోదించడానికి ముందు రైతులు, ఎన్‌జీవోలు, రైతు సంఘాలు, లబ్ధిదారుల అభిప్రాయాలను సమగ్రంగా సేకరించి వాటిని ముసాయిదాలో పొందుపరిచి ఆమోదం తర్వాతే ముందుకు తీసుకువెళ్తామని తెలిపారు. ఈ ప్రతాపాదిత చట్టంలో మొత్తం 10అధ్యాయాలు, 48 విభాగాలు ఉన్నాయని కలెక్టర్ వివరించారు. 1966 విత్తన చట్టంలోని లోపాలను సవరించి ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా నూతన చట్టం రూపొందించనున్నట్లు తెలిపారు. ఇలాంటి కీలక చట్టంపై ప్రతి రైతు తమ అభిప్రాయాన్ని తెలుపాలని అన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వానికి సమగ్ర నివేదిక పంపనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ నరేష్‌కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు, ఉద్యానవన శాఖ అధికారి సునిల్‌కుమార్, మహదేవపూర్ వ్యవసాయ శాఖ ఏడీఏ శ్రీపాల్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నవీన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మేడారంలో 7వేల కోయ మూలాల బొమ్మలు

సమ్మక్క-సారలమ్మ ఆర్కియాలజీ పరిశోధన కేంద్రం ఫౌండర్ మైపతి అరుణ్ - 6లో..

మళ్లీ కేసీఆర్‌నే సీఎం చేద్దాం..

దీక్షా దివస్‌లో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



నాటి కేసీఆర్ నిరాహార దీక్ష ఫొటోల ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర, తదితరులు

కృష్ణకాలనీ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆమరణ దీక్షతో తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోసి, స్వరాష్ట్రాన్ని సాధించుకున్న కేసీఆర్‌నే మళ్లీ సీఎం చేద్దామని మాజీ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భూపాలపల్లిలో శనివారం నిర్వహించిన దీక్షా దివస్‌కు ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు.

ముఖ్యమంత్రిగా కొనసాగిన పదేళ్లలో రాష్ట్రాన్ని కేసీఆర్ అన్నపూర్ణగా తీర్చిదిద్దారని కొనియాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించారని, మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగునీరు సరఫరా చేశారని గుర్తు చేశారు. నూతన జిల్లాలను తీసుకొచ్చి మారుమూల ప్రాంతాలను సైతం ఎంతో అభివృద్ధి చేశాన్నారు. బూటకపు మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజా సంక్షేమాన్ని విస్మరించిందని విమర్శించారు. ఆ పార్టీని గద్దెదింపి మూడోసారి కేసీఆర్‌ను ముఖ్యమంత్రి చేసుకుందామని అన్నారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతితో కలిసి వంద పడకల ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. నాటి కేసీఆర్ దీక్షకు సంబంధించిన ఫొటోలతో బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను వెంకటరమణారెడ్డి, ఇతర నాయకులు తిలకించారు. మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి, మాజీ వైస్ చైర్మన్ గండ్ర హరీశ్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా నాయకులు కళ్లెపు రఘుపతిరావు, సెగ్గం సిద్ధు, జంగేడు పీఏసీఎస్ చైర్మన్ మేకల సంపత్ యాదవ్, పార్టీ రూరల్ మండల అధ్యక్షుడు పిన్‌రెడ్డి రాజిరెడ్డి, జాగృతి జిల్లా అధ్యక్షుడు మాడ హరీశ్‌రెడ్డి, నాయకులు పిల్లి వేణు, టీబీచారి, పోలవేణి అశోక్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



బొగత జలపాతం వద్ద సందడి చేస్తున్న విద్యార్థులు

బొగత వద్ద సందడి

వాజేడు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): తెలంగాణ నయాగరా బొగత జలపాతం వద్ద శనివారం సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు తరలివచ్చారు. ముఖ్యంగా భూపాలపల్లి జిల్లా గణపురం, హైదరాబాద్‌లోని మల్కాజిగిరికి చెందిన విద్యార్థుల రాకతో అక్కడి కోలాహలంగా మారింది. జలపాతం వద్ద కొలనులో విద్యార్థులు జలకాలాడుతూ సందడి చేశారు. జలపాతం విశేషాలను స్థానిక సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సుమారు 300 మంది విద్యార్థులు బొగతను సందర్శించారని అటవీ శాఖ సిబ్బంది తెలిపారు.

సిమెంటు లారీ బోల్తా

డ్రైవర్‌కు తీవ్ర గాయాలు



గాయపడ్డ డ్రైవర్

మొగుళ్లపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సిమెంటు లారీ అదుపుతప్పి బోల్తాపడిన సంఘటన మండలంలోని మొగుళ్లపల్లి- ములకలపల్లి గ్రామాల మధ్య పెద్దవాగు బ్రిడ్జి సమీపంలో శనివారం చోటుచేసుకుంది. మొగుళ్లపల్లిలో సిమెంటు బస్తాలను ఓషాపులో డంపింగ్ చేసి తిరిగి జమ్మికుంట వైపు వెళ్తున్న లారీ అదుపు తప్పింది. దీంతో పెద్దవాగు వంతెన మలుపు వద్ద బోల్తా పడింది. ఈప్రమాదంలో లారీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఆయన్ను స్థానికులు చిట్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

నామినేషన్ల స్వీకరణలో అప్రమత్తంగా ఉండాలి

దంతాలపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఈనెల 30 నుంచి డిసెంబరు 2వ తేదీ వరకు స్వీకరించనున్న సర్పంచ్ ఎన్నికల నామినేషన్ల స్వీకరణలో రిటర్నింగ్ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఎంపీడీవో విజయ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన ఆర్‌వోల సమావేశంలో ఆమె మాట్లాడుతూ మండలంలోని ఆరు సెంటర్ల ద్వారా 18 గ్రామ పంచాయతీలకు సంబంధించిన నామినేషన్లను స్వీకరిస్తామన్నారు. ఒక్కో సెంటర్‌కు ఆర్‌వోలు ఉంటారన్నారు. బరిలో ఉండే అభ్యర్థులు నేరుగా ఆర్‌వోల వద్ద నామినేషన్ ఫారంను ఉచితంగా పొంది అన్ని పత్రాలతో నామినేషన్లు సమర్పించాలన్నారు. నామినేషన్ వేసే సమయంలో వార్డు సభ్యుల అభ్యర్థులు, సర్పంచ్ అభ్యర్థులు ఎలాంటి తప్పులు లేకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. నామినేషన్ వేసేవారు ఎన్ని సెట్లయినా దాఖలు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్ఠమైన చర్యలు



తొర్రూరు మండల పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఐ గణేష్, ఎస్సై

తొర్రూరు రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ కేంద్రాల వద్ద ఎలాంటి ఆకస్మిక ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు సీఐ గణేష్ తెలిపారు. శనివారం మండలంలోని నామినేషన్ కేంద్రాలను ఎస్సై ఉపేందర్, సీఐ గణేష్ పరిశీలించి మాట్లాడారు. నామినేషన్ ప్రక్రియ సజావుగా సాగేందుకు పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. నామినేషన్ కేంద్రాల వద్ద 163 బీఎన్ఎస్ఎస్ సెక్షన్ అమలులో ఉంటుందని, మండలంలో నామినేషన్ కేంద్రాల వద్ద గుమిగూడటం, ర్యాలీలు చేపడితే చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికలు ప్రశాంతం గా జరిగేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు.

క్లస్టర్ల వారీగా నామినేషన్ల స్వీకరణ : ఆర్డీవో

తొర్రూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : తొర్రూరు మండల పరిధిలోని 31 సర్పంచ్ స్థానాలకు ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆర్డీవో గణేష్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎన్నికల అధికారులకు, ఇతర సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఈ నెల 30 నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. మండల పరిధిలో 10 క్లస్టర్లు ఏర్పాటు చేశామని, ఆయా క్లస్టర్ల పరిధిలో ఏర్పాటు చేసిన గ్రామాల్లో నామినేషన్లు స్వీకరిస్తారన్నారు. ఈనెల 30 నుంచి డిసెంబరు 2 వరకు నామినేషన్ల స్వీకరణ, 3న పరిశీలన, 4న అభ్యర్థుల జాబితా, అభ్యంతరాలకు చివరి తేదీ, 6న ఉపసంహరణ, డిసెంబరు 14న పోలింగ్, అదే రోజు మధ్యాహ్నం 2గంటల తర్వాత ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన ఉంటుందన్నారు. మండలంలోని చింతలపల్లి క్లస్టర్‌లో చింతలపల్లి, కొమ్మనపల్లి, హచ్చుతండా, మాటేడు క్లస్టర్‌లో కిష్టాపురం, పోలెపల్లి, ఫత్తేపురం, మాటేడు, హరిపిరాల క్లస్టర్‌లో హరిపిరాల, కర్కాల, వెంకటాపురం క్లస్టర్‌లో వెంకటాపురం, అమర్‌సింగ్‌తండా, దుబ్బతండా, అమ్మాపురం క్లస్టర్‌లో అమ్మాపురం, జీకే తండా, వెలికట్టె క్లస్టర్‌లో పెద్దమంగ్యతండా, టీక్యతండా, వెలికట్టె, చెర్లపాలెం క్లస్టర్‌లో చెర్లపాలెం గోపాలగిరి, చీకటాయపాలెం, గుర్తూరు క్లస్టర్‌లో గుర్తూరు, ఖానాపురం, సోమారం, జమస్తాన్‌పురం, మడిపెల్లి క్లస్టర్‌లో మడిపెల్లి, కంటాయపాలెం, ఎస్‌వీకే తండా, నాంచారిమడూర్ క్లస్టర్‌లో గుడిబండతండా, భోజ్యతండా, ఈదులకుంట తండాల అభ్యర్థులు నామినేషన్లు వేయాలన్నారు. కార్యక్రమంలో డీటీ నర్సయ్య, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎస్సై ఉపేందర్, ఆయా గ్రామాల జీపీవోలు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో గణేష్

ఓటరు జాబితా సిద్ధం

దంతాలపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 18 గ్రామ పంచాయతీలకు గాను ఓటరు జాబితాను సిద్ధంగా ఉంచినట్లు మండల పంచాయతీ అధికారి మహ్మద్ అప్సర పాషా శనివారం తెలిపారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయంలో జీపీల వారీగా లిస్టును తయారు చేసి డిసెంబరు 14న జరగనున్న స్థానిక ఎన్నికలకై సిద్ధంగా ఉంచనున్నామన్నారు. మంలడలంలో మొత్తం 23,663 ఓటర్లు ఉండగా అందులో మహిళా ఓటర్లు 13,663, పురుష ఓటర్లు 13,019 ఉన్నారని చెప్పారు. 18 జీపీలకు గాను 166 వార్డు లు ఉన్నాయన్నారు. మండల ప్రజలు శాంతియుతంగా తమ ఓటును నిర్భయంగా వినియోగించుకోవాలన్నారు.

చట్టాన్ని అతిక్రమిస్తే సహించేది లేదు

● తహసీల్దార్ సునిల్‌కుమార్, ఎస్సై రాజు

దంతాలపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల నేపథ్యంలో 144 సెక్షన్ అమలులో ఉండడంతో చట్టాన్ని అతిక్రమిస్తే సహించేది లేదని తహసీల్దార్ సునిల్‌కుమార్, ఎస్సై పిల్లల రాజు హెచ్చరించారు. మండలంలోని బీరిశెట్టిగూడెం, రేపోణి, కుమ్మరికుంట్ల నామినేషన్ల సెంటర్లను వారు శనివారం పరిశీలించారు. జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఈనెల 25 నుంచి 144 సెక్షన్ అమలులో ఉంచామన్నారు. ఈనెల 30 నుంచి 15 వరకు నామినేషన్ సెంటర్లతో పాటు ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. బెల్టు షాపుల్లో మద్యం అమ్మితే చర్యలు తీసుకుంటామన్నారు. డిసెంబరు 3న స్క్రూటినీ, 4న ఫిర్యాదులు, 5న పోటీలో ఉండే అభ్యర్థుల జాబితా వెల్లడి, 6న విత్‌డ్రాలు, అదే రోజు తుది జాబితా అభ్యర్థుల పేర్లను వెల్లడిస్తారన్నారు. 14న పోలింగ్‌తో పాటు ఫలితాలను ప్రకటిస్తారని పేర్కొన్నారు.

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య



రమేష్ (ఫైల్)

రఘునాథపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం ఆంధ్రతండాలో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... మాలోతు రమేష్(39)కు భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. తనకున్న 9 గుంటలకు తోడు మరో నాలుగు ఎకరాల కౌలుకు తీసుకోని వ్యవసాయం చేస్తున్నాడు. అనారోగ్య సమస్యలతో సాగు సక్రమంగా చేయకపోవడంతో రూ.10లక్షల వరకు అప్పులయ్యాయి. దీంతో మనస్తాపం చెంది ఇంట్లో ఉన్న పురుగుల ఉదయం మందు తాగగా, విషయాన్ని గుర్తించిన కుటుంబ సభ్యులు జనగామ జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ డి.నరేష్ తెలిపారు.

మెనూ విస్మరిస్తే కఠిన చర్యలు

మరిపెడ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజనం విషయంలో మెనూ విస్మరిస్తే ఆ స్కూల్ నిర్వాహకులపై కఠిన చర్యలు ఉంటాయని ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన తాళ్లాకల్‌లోని యూపీఎస్ స్కూల్‌ను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. భోజన రుచి, సుచిపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఎంపీవో సోమ్లానాయక్, హెచ్ఎం, ఉపాధ్యాయులు ఉన్నారు.

నామినేషన్ల స్వీకరణ కేంద్రాల తనిఖీ

మరిపెడ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను ఎంపీడీవో శనివారం తనిఖీ చేశారు. మండలంలోని తాళ్లాకల్ నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని పరిశీలించి సిబ్బందికి ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. రిటర్నింగ్ ఆఫీసర్స్ విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ సాగేలా అన్ని చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఎంపీవో సోమ్లానాయక్, పంచాయతీ కార్యదర్శి, రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్స్ ఉన్నారు.

టాలెంట్ టెస్ట్‌లో వీరారం విద్యార్థుల ప్రతిభ



వీరారంలో విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మరిపెడ రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయిలో శుక్రవారం నిర్వహించిన టాలెంట్ టెస్ట్ టీఎం(తెలుగు మీడియం) విభాగంలో మండలంలోని వీరారం జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు రెండవ స్థానం పొందారని ఇన్‌చార్జ్ హెచ్ఎం ఆర్.మధు శనివారం తెలిపారు. ఈ మేరకు టాలెంట్ టెస్ట్‌లో పాల్గొన్న విద్యార్థులు ఎం.జశ్వంత్, బి.జశ్వంత్, బి.చైతన్యలను ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడితోపాటు ఉపాధ్యాయులు ఎం.రవి, మారెడ్డి వెంకట్, అనిల్‌కుమార్, వెంకన్నలు అభినందించారు.

బీసీల వ్యతిరేక పార్టీ కాంగ్రెస్

బ్లూ ఇండియా పార్టీ జాతీయ అధికార ప్రతినిధి మధు



మాట్లాడుతున్న భూంపల్లి మధు

మరిపెడ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : బీసీల వ్యతిరేక పార్టీ కాంగ్రెస్సేనని బ్లూ ఇండి యా పార్టీ జాతీయ అధికార ప్రతినిధి భూంపల్లి మధు అన్నారు. శనివారం ఆయన స్థానిక పార్టీ నేతలతో కలిసి మరిపెడ విశ్రాంతి భవనం వద్ద విలేకరులతో మాట్లాడారు. మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీ బీసీలను అణిచివేస్తుందన్నారు. మండల్ కమిషన్, కలేల్కర్ కమిషన్‌ను అడ్డుకున్నది కాంగ్రెస్ పార్టీనని గుర్తు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి బీసీలకు 42శాతం అంటూ జీవో 46 ద్వారా ఉన్న రిజర్వేషన్లకు ఫుల్‌స్టాప్ పెట్టాడని విమర్శించారు. ఎన్నికల హామీలను, ఆరు గ్యారెంటీలను అటకెక్కించిన విషయాన్ని వివరించారు. మహిళలకు నెలకు రూ. 2500, ఆడపిల్లల పెళ్లిళ్లకు తులం బంగారం, ఆసరా పింఛన్ల పెంపు ఒట్టి మాటలేనని ఆరోపించారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లను అమలు చేసే వరకు పంచాయతీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెప్పాలని ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో ఆ పార్టీ నాయకులు బానోత్ లింగన్న, బాలునాయక్, గుగులోత్ వీరన్న తదితరులు పాల్గొన్నారు.

మేడారంలో 7వేల కోయ మూలాల బొమ్మలు

● సమ్మక్క-సారలమ్మ ఆర్కియాలజీ పరిశోధన కేంద్రం ఫౌండర్ మైపతి అరుణ్



శిలలపై చెక్కుతున్న చిత్రాలను పరిశీలిస్తున్న ఆర్కియాలజీ పరిశోధన బృందం

తాడ్వాయి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మేడారం సమ్మక్క- సారలమ్మల దేవస్థానంలో 7 వేల కోయ మూలాల బొమ్మలు చెక్కిన రాతి నిర్మాణం చేపడుతున్నట్లు ఆర్కియాలజీ పరిశోధన కేంద్రం ఫౌండర్ డాక్టర్ మైపతి అరుణ్ కుమార్ తెలిపారు. మేడారం దేవస్థానంలో ఏర్పాటు చేసేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూల్ జిల్లా ఆల్లగడ్డలో రూపొందిస్తున్న రాతికట్టడాల శిలలను ఆయన శనివారం పరిశీలించారు. అక్కడి నుంచి ఆయన విలేకరులతో మాట్లాడారు. రాతి చెక్కిన కోయ మూలాల చిత్రాలను పరిశోధన బృందంతో కలిసి పరిశీలించినట్టు తెలిపారు. కోయ వంశ చరిత్రలతో కూడిన 3 - 7 గొట్ల సంస్కృతి, వంశ వృక్షాలు, జంతువులు, పక్షులు, ప్రకృతి దైవాలు, కోయ రాజరిక చరిత్రలకు చెందిన చిత్రాలను ఏర్పాటుకు పనులు జరుగుతున్నాయని అన్నారు. సమ్మక్క-సారలమ్మల దేవస్థానంలో 9 ఆర్చీలు, నాలుగు గద్దెలపై 32 రాతి స్తంభాలు, 29ప్రాకారం ప్యానెల్స్‌పై కోయ మూలాల బొమ్మలను రూపొందిస్తున్నట్టు తెలిపారు. వీటి శైలి పూర్వ బొమ్మల కూర్పు పడిగ తాళపత్రం బొమ్మలలో లిపి సూక్ష్మస్థాయిలో ఉందని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే పరిశోధన బృందం నిరంతరం రాతి శిల్పకళను పరిశీలించామన్నారు. ఈ కార్యక్రమంలో పరిశోధన బృందం కొర్నిబెల్లి వినయ్, కోరం లక్ష్మణ్, గొంది రాకేష్, బోధ శివ తదితరులు పాల్గొన్నారు.

హోమం వద్ద నాగుపాము



దత్తాత్రేయస్వామి ఆలయంలో పడగతో నాగుపాము

కాటారం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని దత్తాత్రేయస్వామి ఆలయంలో దత్త నవరాత్సోవాల్లో భాగంగా శనివారం మహానారాయణ హోమం నిర్వహించగా అనుకోని అతిథిగా నాగుపాము కనిపించింది. బండలపై ఉన్న నీళ్లలో తిరిగి హోమగుండం వద్దకు పాము రావడంతో వేదపండితులు మొదట ఆందోళన చెందారు. నారాయణ హోమం జరగడంతో ఆదిశేషుడు వచ్చాడని పలువురు భక్తులు అభిప్రాయపడ్డారు. కొందరు యువకులు నాగుపామును సంచిలో పట్టి పొలాల వైపు తీసుకెళ్లి వదిలిపెట్టినట్లు అర్చకుడు కృష్ణమోహన్ తెలిపారు.

మేడారంలో వాటర్‌ప్లాంట్‌కు మరమ్మతులు



వాటర్ ప్లాంట్‌కు మరమ్మతు చేస్తున్న సిబ్బంది

తాడ్వాయి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మేడారం సమ్మక్క- సారలమ్మల దేవస్థానంలో భక్తులకు తాగునీటిని అందించేందుకు ఏర్పాటు చేసిన ఆర్‌వో వాటర్ ప్లాంట్‌కు శనివారం మరమ్మతులు చేశారు. 'జాతర సమీపిస్తున్నా.. అదే తీరు' శీర్షికన ప్రచురితమైన కథనంపై అధికారులు ఈ మేరకు స్పందించారు. తాగునీరు లేక భక్తులు ఇబ్బందులు పడుతుండగా దేవస్థానం కార్యనిర్వహణ అధికారి వీరస్వామి, అధికారులు ప్రాంగణంలోని ఆర్‌వో వాటర్ ప్లాంట్‌కు మరమ్మతులు చేయించారు.

కిటకిటలాడిన హేమాచల క్షేత్రం





భక్తుల రద్దీతో కిటకిటలాడుతున్న హేమాచల క్షేత్రం, స్వామి వారి మూల విరాట్టు

మంగపేట నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ మల్లూరు హేమాచలం లక్ష్మీనరసింహ స్వామి పుణ్యక్షేత్రం శనివారం కిటకిటలాడింది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించు కున్నారు. శని, ఆదివారాల్లో స్వామి వారి నిజ రూప దర్శనం తిల తైలా భిషేక కార్యక్రమాలు జరుగుతుండటంతో ఈ వేడుకలను తిలకించేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. వీరి దాహార్తిని తీర్చేందుకు ఓ భక్తుడు రెండు వాటర్ కూలర్లను సమకూర్చాడని ఈవో ఆర్.మహేష్ తెలిపారు.

రిటర్నింగ్ అధికారులే కీలకం

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లిటౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో రిటర్నింగ్ అధికారులదే కీలక పాత్ర అని కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. స్టేజ్-2 రిటర్నింగ్ అధికారులతో కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమం సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికల నిర్వహణలో లాజిస్టిక్స్, మాన్‌పవర్ వినియోగం, నామినేషన్ స్వీకరణ నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ వరకు రిటర్నింగ్ అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. నామినేషన్లు స్వీకరించే దశ నుంచి గెలుపొందిన అభ్యర్థుల జాబితాను ప్రకటించే వరకు ప్రతి పని అత్యంత బాధ్యతాయుతమైందని తెలిపారు. మాస్టర్ ట్రైనర్లు కూసపు కిరణ్‌కుమార్, రాజేంద్రప్రసాద్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేయగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్, ఆర్డీవో రవి, ట్రైయినీ డిప్యూటీ కలెక్టర్ నవీన్‌రెడ్డి, ఎంపీడీవోలు, స్టేజ్-2 అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రెండో విడత నోటిఫికేషన్ జారీ చేయాలి

ఆదివారం ఉదయం 10.30 గంటలలోగా పంచాయతీ రెండో విడత ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయాలని అధికారులను కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. డిసెంబరు 2 నుంచి ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు నామినేషన్లు స్వీకరించాలని సూచించారు. చిట్యాల, టేకుమట్ల, భూపాలపల్లి, పలిమెల మండలాల్లో రెండో విడత ఎన్నికలు ఉంటాయని, వీటికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనపై ఫిర్యాదుల కోసం ప్రజలు 9030632608 నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయొచ్చన్నారు.

రేపు దివ్యాంగులకు క్రీడలు

భూపాలపల్లిటౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భాన్ని పురస్కరించుకుని డిసెంబరు 1న జిల్లాలో క్రీడలు నిర్వహించనున్నట్లు మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి మల్లేశ్వరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ 18 జూనియర్, అండర్ 54 సీనియర్ విభాగాల్లో ఈ పోటీలు ఉంటాయని వివరించారు. ఈ క్రీడలను కలెక్టర్ రాహుల్‌శర్మ ప్రారంభిస్తారని తెలిపారు. ఈ క్రీడలు భూపాలపల్లి పట్టణంలోని అంబేద్కర్ క్రీడా మైదానంలో జరుగుతాయని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డుతో హాజరుకావాలని సూచించారు.

అయ్యవారిపేటలో పౌరహక్కుల దినోత్సవం

వాజేడు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వాజేడు మండలంలోని అయ్యవారిపేట ఎస్సీ కాలనీలో శనివారం తహసీల్దార్ శ్రీరాముల శ్రీనివాస్, పేరూరు ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో పౌరహక్కుల దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా కాలనీలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్, ఎస్సై మాట్లాడుతూ అంటరానితనం పాటించడం తగదన్నారు. ఎవరైనా కులం పేరుతో దూషిస్తే జైలు శిక్ష, జరిమానా తప్పదని హెచ్చరించారు. యువత మత్తు పదర్థాలకు దూరంగా ఉండాలని, గంజాయి సేవించినా, అమ్మినా కఠిన చర్యలు తప్పవని అన్నారు. ఈ సమావేశంలో ఆర్ఐ కుమారస్వామి, జీపీవో సారయ్య, తదితరులు పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డికి ఘన స్వాగతం

గిర్మాజీపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి గంగాపురం కిషన్‌రెడ్డి శనివారం నగర పర్యటనలో భాగంగా ఆయన సికింద్రాబాద్ నుంచి వందే భారత్ రైలులో ఉదయం 6.57 గంటలకు వరంగల్ రైల్వే స్టేషన్‌కు వచ్చారు. మాజీ ఎంపీలు అరూరి రమేష్, సీతారాంనాయక్, మాజీ ఎమ్మెల్యే మార్తి నేని ధర్మారావు, బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్ రెడ్డి, పార్టీ నేతలు రావు పద్మ, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, రఘునాథరెడ్డిలతో కలిసి బీజేపి వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్ కిషన్‌రెడ్డికి సాదర స్వాగతం పలికారు. అదేవిధంగా జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్, రెవెన్యూ అధికారి విజయలక్ష్మి కిషన్ రెడ్డికి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. రైల్వేస్టేషన్ తనిఖీ చేసిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి బీజేపీ నాయకులకు కాఫీ తాగించి ఉత్సాహపరిచారు. అందరి బిల్లు రూ.500 తనే ఫోన్‌పే చేశారు. వరంగల్ రైల్వేస్టేషన్‌లో ఆటో స్టాండ్‌కు పీ జు లేకుండా అనుమంతించాలని, ర్యాపిడో తదితర సంస్థల ప్రవేశం లేకుండా చూడాలని కోరుతూ ఆటోయూనియన్ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. అలాగే ప్రస్తుతం కాజీపేట నుంచి హైదరాబాద్‌కు నడుస్తున్న పుష్‌పుల్ రైలును గతంలో మాదిరిగా వరంగల్ నుంచి నడిపించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్ మంత్రి కిషన్‌రెడ్డిని కోరారు. రైల్వేస్టేషన్‌లోని ప్రభుత్వ రైల్వేపోలీస్‌స్టేషన్ (జీఆర్‌పీ) భవనం పూర్తిగా శిథిలమైందని, దాన్ని పునర్‌నిర్మించాలని విజ్ఞప్తి చేశారు.

ఆర్‌ఎంయూ పనులపై ఆరా

కాజీపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : కాజీపేట సమీపంలోని అయోధ్యపురం వద్ద నిర్మిస్తున్న రైల్వే మాన్యుఫాక్చర్ యూనిట్ (ఆర్‌ఎంయూ)ను శనివారం కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి సందర్శించారు. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాత్సవ, డీఆర్‌ఎం ఆర్.గోపాలకృష్ణన్, ఆర్‌వీఎన్‌ఎల్ చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్, వీవీ సాయిప్రసాద్‌తో కలిసి నిర్మాణంలో ఉన్న కోచ్ ఫ్యాక్టరీని సందర్శించారు. కొనసాగుతున్న నిర్మాణ పనులను, పురోగతిని ఆయన సమీక్షించారు. ప్రధాన షెడ్‌లు టెస్ట్ షాప్, పేయింట్ షాప్, స్టోర్ వార్డ్, అడ్మినిస్ట్రేషన్ బ్లాక్, రెస్ట్ హౌస్, సెక్యూరిటీ, టాయిలెట్‌బ్లాక్, కాంపౌండ్‌వాల్, ఆర్‌యూబీ, ఇంటర్నల్ రైల్వే ట్రాక్, రోడ్లు, ఎలక్ట్రిక్ సబ్‌స్టేషన్, క్యాంటీన్‌ల నిర్మాణం ప్రదేశాలను పరిశీలించారు.

ఏయే షెడ్లలో ఎలాంటి బోగీలను తయారు చేశారు.. ఒక రైలు బోగీని తయారు చేయడానికి ఎన్నిరోజుల సమయం పడుతుందనే విషయాలను రైల్వే జీఎంను అడిగి తెలుసుకున్నారు. సుమారు అరగంట పాటు అన్ని షెడ్లను పరిశీలించి పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైల్వే మంత్రివెంట మాజీ ఎమ్మెల్యేలు వన్నాల శ్రీరాములు ఎం. ధర్మారావు, అరూరి రమేశ్, కొండేటి శ్రీధర్, బీజేపీ నేత రావు పద్మ, దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ బిజయ్ కుమార్‌రత్ తోపాటు రైల్వే అన్ని డిపార్ట్‌మెంట్‌ల హెచ్‌వోడీలు ఉన్నారు..

వినతుల వెల్లువ

కోచ్‌ఫ్యాక్టరీ భూములు కోల్పోయిన వారికి ఉద్యోగ అవకాశాలను కల్పించాలని కోరుతూ భూ నిర్వాసితులు, అయోధ్యపురం రైతులు, రైల్వే జనరల్ ఇనిస్టిట్యూట్‌లో నూతనంగా స్విమ్మింగ్ పూల్, స్కేటింగ్ ట్రాక్, ఏసీ కమ్యూనిటీ హాల్, ఇనిస్టిట్యూట్‌లో పనిచేస్తున్న బాయ్స్‌కు కోచ్‌ఫ్యాక్టరీలో పర్మనెంట్ ఉద్యోగాలు కల్పించాలని టీ రైల్వే ఎంప్లాయీస్ జేఏసీ కన్వీనర్ డి.రాఘవేందర్, చైర్మన్ కొండ్ర నర్సింగరావు బృందం కేంద్ర మంత్రికిషన్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. కార్పొరేటర్‌లు అనిత రంజిత్ రావు, చాడ స్వాతి, పీఏసీఎస్ డైరెక్టర్ రాజ్ కుమార్, 62వ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు మేకల శ్రవణ్,లు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి బొకే ఇచ్చి, శాలువా కప్పి అభినందించారు.


కాజీపేటలో ఆర్‌ఎంయూను పరిశీలిస్తున్న కిషన్‌రెడ్డి

కల్యాణ మండప పనుల్లో ఎందుకు అశ్రద్ధ ?

- పూర్తి నివేదిక ఇవ్వాలని అధికారులకు ఆదేశం
- రుద్రేశ్వరుడి సన్నిధిలో గంటకు పైగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి
- ఆలయంలో సెంట్రల్ లైటింగ్ కోసం ఈవో వినతి


కల్యాణ మండప పనులను పరిశీలిస్తున్న కిషన్‌రెడ్డి తదితరులు

హనుమకొండ కల్చరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వేయి స్తంభాల ఆలయ కల్యాణ మండప పనుల్లో ఎందుకు అశ్రద్ధ చేస్తున్నారని సంబంధిత ఆర్కియాలజీ సిబ్బందిని కేంద్ర పురావస్తు, బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి నిలదీశారు. కల్యాణ మండప పనులను ఆరు నెలల క్రితమే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినా ఇంకా అరకొర మిగిలి ఉన్న ఐదుశాతం పనులపై ఎందుకు కాలయాపన చేస్తున్నారని నిలదీశారు. దీనిపై వెంటనే పూర్తి నివేదిక ఇవ్వాలని కేంద్ర మంత్రి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

రామప్ప ఆలయానికి ప్రసాద్ పథకం కింద రూ. 72 కోట్ల నిధులు కేటాయించడం జరిగిందని ఆ పనులు కూడా నత్తనడకగానే జరుగుతున్నాయని ఈ సందర్భంగా మంత్రి ప్రస్తావించారు. ఈ పనుల ప్రారంభోత్సవానికి ప్రధాని నరేంద్ర మోదీ వస్తారని ఇంకా జాప్యం చేస్తే సహించేది లేదన్నారు. వేయిస్తంభాల ఆలయ అభివృద్ధికి నిధుల కొరత లేదని గార్డెనింగ్, సెంట్రల్ లైటింగ్, వాకింగ్‌ప్లాట్‌ఫాం లాంటివి కల్పిస్తామని కిషన్‌రెడ్డి హామీ ఇచ్చారు. అంతకుముందు వేయిస్తంభాల ఈవో అనిల్‌కుమార్, ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్రశర్మ ఆలయ అభివృద్ధి కోసం మంత్రికి ప్రత్యేకంగా వినతి పత్రం అందజేశారు.

రుద్రేశ్వరుడి సన్నిధిలో..

వరంగల్ పర్యటన సందర్భంగా శనివారం ఉదయం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, కేంద్ర పురావస్తుశాఖ, రాష్ట్ర సూపరింటెండెంట్ నిఖిల్‌దాస్, డిప్యూటీ ఇంజనీర్ ఆర్కియాలజీ కృష్ణ చైతన్య, వరంగల్ ఉమ్మడి జిల్లా అధికారి అజిత్, ఇంటాక్‌కన్వీనర్ ప్రొఫెసర్ పాండురంగారావులో కలిసి ప్రసిద్ధ వేయిస్తంభాల ఆలయాన్ని సందర్శించారు. రుద్రేశ్వరుడి సన్నిధిలో పంచామృతాలతో రుద్రాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రాంగణాన్ని అంత నిశితంగా పరిశీలించారు. నందిశ్వరుడి వద్ద, శిల్పకళను మెచ్చుకుంటూ ప్రత్యేకంగా ఫొటోలు దిగారు. ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ నాట్య మండపంలో కిషన్‌రెడ్డికి స్వామివారి ప్రసాదాలు, శేష వస్త్రాలు బహుకరించారు.

అమ్మవారి దర్శనం ఆనందదాయకం

వరంగల్ కల్చరల్: భద్రకాళి అమ్మవారి పాదల చెంతన ఉండి దర్శించుకోవడం తనకెంతో సంతోషంగా ఉందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి గంగాపురం కిషన్‌రెడ్డి అన్నారు. శనివారం వరంగల్ వరంగల్ పర్యటనకు వచ్చిన ఆయన భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రధానార్చకుడు భద్రకాళి శేషు నేతృత్వంలోని ఈవో సునీత, ధర్మకర్తలు మంగళ వాయిద్యాలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. ముందుగా గోవులకు గ్రోసానం చేసి వల్లభ గణపతి, ఆదిశంకరాచార్యులను దర్శించుకొని అనంతరం అమ్మవారి గర్భగుడిలో పూజలు చేశారు. అనంతరం వారికి అమ్మవారి శేష వస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో ధర్మకర్తలు ఓరుగంటి పూర్ణచందర్, మోతుక్కూరి రామేశ్వర్‌రావు, నార్ల సుగుణ, జారతి వెంకటేశ్వర్లు, తొనుపునూరి వీరన్న, బింగి సతీష్, అనంతుల శ్రీనివాస్, మూగ శ్రీనివాస్‌తో పాటు బీజేపీ నాయకులు రావు పద్మ, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, గంటా రవికుమార్, డాక్టర్ కాళీప్రసాద్, అరూరి రమేష్, మార్తినేని ధర్మారావు, ప్రొఫెసర్ సీతారాం నాయక్ తదితరులు పాల్గొన్నారు. భద్రకాళి అమ్మవారి చిత్రపటాన్ని వరంగల్, కాజీపేట రైల్వే స్టేషన్లలో ఏర్పాటు చేయడానికి దక్షిణ మధ్య రైల్వే అధికారులు అనుమతి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని భద్రకాళి దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు.


అమ్మవారికి పూజలు చేస్తున్న కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి తదితరులు

పరిశీలిస్తూ.. సూచనలిస్తూ..

- నగరంలో 8 గంటల పాటు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పర్యటన
- కాజీపేటలో రైల్వే మ్యాన్‌ఫ్యాక్టరింగ్ యూనిట్ పరిశీలన

వరంగల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి నగరంలో సుమారు ఎనమిది గంటల పాటు వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటూ గడిపారు. శనివారం ఉదయం 5గంటలకు హైదరాబాద్ నుంచి వందేభారత్ రైలులో బయలుదేరి, వరంగల్‌కు ఉదయం 6.30గంటలకు చేరుకున్నారు. వరంగల్ రైల్వే స్టేషన్‌లో అధికారులు స్వాగతం పలికారు. ఇటీవలే అమృత్ పథకం కింద వరంగల్ రైల్వే స్టేషన్‌ను ఆధునీకరించారు. రైల్వే అధికారులు మంత్రికి రైల్వేస్టేషన్ గురించి, సౌకర్యాల గురించి వివరించారు.

ఈ సందర్భంగా బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ పుష్‌పుల్ రైల్‌ను పునరుద్ధరించాలని, సామాన్య ప్రయాణీకులు ఇబ్బంది పడుతున్నారని వివరిస్తూ వినతి పత్రాన్ని అందించారు. అనంతరం రైల్వే స్టేషన్‌ను పరిశీలించిన మంత్రి.. అక్కడ ఉన్న ప్రయాణీకులతో టీ తాగుతూ చాయ్ పే చర్చ పెట్టారు. రైల్వే స్టేషన్‌లో అందుతున్న సేవలపై చర్చించారు. అక్కడి నుంచి ఉదయం 8.15గంటలకు భద్రకాళీ ఆలయానికి మంత్రి చేరుకున్నారు. కిషన్‌రెడ్డికి పూజారులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో కేంద్ర మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అక్కడి నుంచి ఉదయం 9.10గంటలకు వేయిస్తంభాల ఆలయంలో కల్యాణ మండపం పనులు పరిశీలించారు. మిగిలిపోయిన పనులను వెంటనే పూర్తయ్యేలా చూడాలని పురావస్తు శాఖ అధికారులను ఆదేశించారు. రుద్రేశ్వరుడికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి హరిత కాకతీయ హోటల్‌లో ఉదయం 11గంటలకు వరంగల్ స్మార్ట్ సిటీ పనులు, హృదయ్, హెరిటేజ్ పనులపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌తో పాటు పలువురు ఇంజనీర్లు, కూడా అధికారులు పాల్గొన్నారు.

మధ్యాహ్నం 1గంటకు కాజీపేటలోని రైల్వే మ్యానుపక్చరింగ్ యూనిట్‌ను సందర్శించారు. రూ.521కోట్లతో జరుగుతున్న పనులను అధికారులతో సమీక్షించారు. దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ, ఆర్‌వీఎన్‌ఎల్ చీఫ్ ప్రాజెక్టు మేనేజర్ పీవీ.సాయి ప్రసాద్‌లు ఆర్‌ఎంయూ పురోగతిపై వివరించారు. అనంతరం మధ్యాహ్నం 3గంటలకు హరిత హోటల్‌లో జాతీయ రహదారులు, సీసీఐ అధికారులతో వేర్వేరుగా సమీక్ష సమావేశాలు నిర్వహించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు సంబంధించిన రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. సాయంత్రం 4.25గంటలకు మీడియాతో మాట్లాడిన తనంతరం కార్యకర్తలు, వివిధ వర్గాల నుంచి వినతులను స్వీకరించారు. సాయంత్రం 5.10గంటలకు రోడ్డు మార్గాన కిషన్‌రెడ్డి హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లారు.

స్మార్ట్ సిటీ పనులు త్వరగా పూర్తి చేయండి

- టెక్స్‌టైల్ పార్క్‌ప్రారంభోత్సవానికి ప్రధానిని తీసుకొస్తా
- అధికారులతో సమీక్షలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ నగరాన్ని అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుతం పెద్ద ఎత్తున నిధులు కేటాయించడం జరిగిందని, డిసెంబరు చివరి వరకు స్మార్ట్‌సిటీ పనులు పూర్తి చేయాలని కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. శనివారం నగరంలో పర్యటన సందర్భంగా మనుమకొండ నక్కగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో బీజేపీ వరంగల్, హనుమకొండ జిల్లాల అధ్యక్షులు రావు పద్మ, సంతోష్‌రెడ్డితో పాటు కుడా, కార్పొరేషన్, ఆర్కియాలజీ, స్మార్ట్‌సిటీ అధికారులతో కలిసి రివ్యూ మీటింగ్ నిర్వహించారు. కుడా, గ్రేటర్ వరంగల్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను అడిగి తెలుసుకున్నారు. హనుమకొండ అగ్గలయ్యగుట్టపై జైనహిల్స్, పద్మాక్షి గుట్టల అభివృద్ధికి తాను కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రిగా పని చేసిన కాలంలో ప్రత్యేక నిధులు కేటాయించడం జరిగిందని, ప్రస్తుతం పనులు ఏ దశలో ఉన్నాయని కమిషనర్ చహత్ బాజ్‌పాయ్‌ని అడిగి తెలుసుకున్నారు. పనులు పూర్తయ్యాని కమిషనర్ చెప్పడంతో సంతోషం వ్యక్తం చేశారు.

ఇంకా నగరంలోని వేయి స్తంభాల దేవాలయ అభివృద్ధిపై దృష్టి సారించాలని, మిగిలి ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే వరంగల్ కోటలోని శృంగార బావిని అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ఏఎస్‌ఐ సమన్వయంతో ముందుకు సాగాలని చెప్పినట్టు అధికారులు తెలిపారు. ఖిలావరంగల్ కోట బయట, లోపలి ప్రాంతంలో భూములు కబ్జాకు గురవుతున్నట్టు తన దృష్టికి వచ్చిందని, చారిత్రక సంపదను కాపాడుకోవాలని అధికారులకు గుర్తు చేశారు. స్మార్ట్‌సిటీ నిధులు త్వరగా విడుదల చేయడంతో పాటు ఇంకా మరిన్ని నిధులు మంజూరు చేయాలని కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ కోరడంతో తప్పకుండా సహకారం అందిస్తామని హామీ ఇచ్చినట్టు అధికారులు తెలిపారు.

అస్కి స్కీం ద్వారా నగరాన్ని అభివృద్ధి చేయవచ్చని దీనిపై కేంద్రంతో మాట్లాడుతానని కిషన్‌రెడ్డి చెప్పారు. టెక్స్‌టైల్ పార్క్ పనులను త్వరగా పూర్తి చేస్తే ప్రారంభ కార్యక్రమానికి ప్రధాని మోదీని ముఖ్య అతిథిగా తీసుకుని వస్తానని కిషన్‌రెడ్డి హామీ ఇస్తున్నట్టు చెప్పారు. కుడా పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సీపీవో అజీత్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జీడబ్ల్యూఎంసీ కమిషనర్, కుడా వైస్ చైర్‌పర్సన్ చహత్ బాజ్‌పాయ్, కార్పొరేటర్లు గుజ్జుల వసంత, చాట స్వాతి, డీఆర్‌వో విజయలక్ష్మి, కుడా సీపీవో అజిత్‌రెడ్డి, జీడబ్ల్యూఎంసీ ఎస్‌ఈ సత్యనారాయణ, జిల్లా పర్యటక శాఖ అధికారి శివాజీతో పాటు ఆర్కియాలజీ అధికారులు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

ఓరుగల్లుకు కొత్త వెలుగులు

(5వ పేజీ తరువాయి)

వరంగల్ కోట భూములను అక్రమణ నుంచి కాపాడాలని జిల్లా కలెక్టర్‌కు ఆర్కియాలాజి అధికారులు విజ్ఞప్తి చేసిన లాభం లేదని, తానే సీఎం రేవంత్‌రెడ్డితో పాటు సీఎస్‌కు లేఖ రాస్తానని తెలిపారు. వెయ్యిస్థంబాల ఆలయ కల్యాణ మండపాన్ని పూర్తి స్థాయిలో నిర్మాణం చేశామన్నారు.

త్వరలోనే ఎయిర్‌పోర్టు, ఆర్‌ఎంయూ

వరంగల్ ఎయిర్‌పోర్టును త్వరలోనే అందుబాటులోకి తీసుకవస్తామని కిషన్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే ఏఏఐ వద్ద 696ఎకరాల భూమి అందుబాటులో ఉందని, ఇంకా 280ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం సేకరిస్తుందన్నారు. ఈ భూమిని ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియాకు అప్పగిస్తే పనులు మొదలవుతాయన్నారు. ఇప్పటికే ఎయిర్‌పోర్టు ప్రహరి నిర్మాణం పనులు చేపట్టినట్లు తెలిపారు. వరంగల్ నుంచి తొలుత ఏటీఆర్ విమానాలను నడుపుతామన్నారు. వరంగల్ నుంచి హైదరాబాద్, విజయవాడ, రాజమండ్రి, తిరుపతి, షిరిడి, నాగ్‌పూర్ వరకు నడిపిస్తామని, ప్రజల నుంచి వచ్చే స్పందనను బట్టి పెద్ద విమానాలను కూడా నడిప్తామన్నారు. పెద్ద విమానాలు ల్యాండ్ అయ్యే విధంగానే రన్‌వే నిర్మాణం జరుగుతుందని కిషన్‌రెడ్డి తెలిపారు.

అలాగే కాజీపేటలో 160 ఎకరాల్లో నిర్మిస్తున్న రైల్వే మ్యాన్‌ఫక్చరింగ్ యూనిట్ (ఆర్‌ఎంయూ)ను వచ్చే ఏడాదికి పూర్తి చేస్తామన్నారు. తొలి విడత రూ.521కోట్ల ఆర్‌ఎంయూ పనులు చేపట్టామన్నారు. ఇప్పటికే 75శాతం పనులు పూర్తయ్యాయని, స్ట్రక్చర్ నిర్మాణం పనులు పూర్తి కావచ్చాయని, ఎక్విప్‌మెంట్ తీసుకవస్తున్నామని తెలిపారు. ఆధునీక టెక్నాలజీతో ఆర్‌ఎంయూ నిర్మిస్తున్నామని, దేశానికి ఇది తలమానికంగా ఉంటుందన్నారు. ఇక్కడి నుంచి దేశంలోని నలుమూలలకు రైళ్ల కనెక్టివిటి ఉంటుందన్నారు. విద్యుత్ అదా కోసం సోలార్ సిస్టాన్ని అమలు చేస్తున్నామని, వర్షం నీటిని వృధాగా వెళ్లకుండా సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

జాతీయ రహదారుల నిర్మాణం

వరంగల్‌ను జాతీయ రహదారులతో అనుసంధానం చేస్తున్నామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో 1.26లక్షల కోట్లతో జాతీయ రహదారుల అభివృద్ధి జరుగుతుండగా, మరో రూ.80వేల కోట్లకు సంబంధించి టెండర్లు ఆన్‌లైన్‌లో ఉన్నాయన్నారు. వీటిలో రూ.730కోట్లతో వరంగల్-మంచిర్యాల జాతీయ రహదారిని నిర్మిస్తున్నామన్నారు. అలాగే వరంగల్-కరీంనగర్ జాతీయ రహదారికి రూ2,480తో పనులు చేపట్టామన్నారు. ఇప్పటికే తొలివిడత రూ.1,650కోట్లతో 80శాతం పనులు పూర్తి చేశామని, త్వరలోనే మిగతా పనులు పూర్తి చేస్తామన్నారు. వరంగల్ రింగ్‌రోడ్డులో 50శాతం జాతీయ రహదారి కింద రూ.500కోట్లతో పూర్తి చేశామని తెలిపారు. మిగతా 50శాతం పనులు ఎన్‌హెచ్ ద్వారా చేపట్టేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించిన మంత్రి తెలిపారు.

వరంగల్‌పై వివక్ష

చారిత్రక నేపథ్యం ఉన్న వరంగల్ నగరంపై వివక్ష చూపుతున్నా రని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. వరంగల్ నగరాన్ని రెండు ముక్కలు చేశారని, కానీ హైదరాబాద్‌లో మాత్రం మరిన్ని నగరాలను కలుపుతారా అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. వరంగల్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం వివక్ష చూపిస్తుందనటానికి ఇంతకంటే ఏం నిదర్శనం కావాలని ప్రశ్నించారు.

మెగా టెక్స్‌టైల్ పార్కుకు రూ. 300 కోట్లు

వరంగల్ కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుకు రూ.300 కోట్లు కేటాయిస్తున్నట్లుగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. పీఎం మిత్ర పథకం ద్వారా దేశంలో ఏడు టెక్స్‌టైల్ పార్కులను ఏర్పాటు చేస్తే.. అందులో తెలంగాణ నుంచి వరంగల్ కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కును ఎంపిక చేశామని తెలిపారు. ఈ ఏడింట్లో ఆరు గ్రీన్‌ఫీల్డ్ పార్కులు కాగా, వరంగల్ మాత్రం బ్రౌన్‌ఫీల్డ్ ప్రాజెక్టుగా ఎంపిక చేశామన్నారు. ఇప్పటికే ఈ ప్రాజెక్టుకు భూసేకరణ పూర్తి చేయటంతో పాటు మూడు కంపెనీలు కూడా వచ్చాయన్నారు. ఇంకా 30శాతం పనులు మాత్రమే మిగిలి ఉన్నాయన్నారు. మరిన్ని కొత్త కంపెనీలు వచ్చే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. ఇప్పటికే రూ.30కోట్ల నిధులు విడుదల చేశామని, త్వరలోనే మరో రూ.30కోట్ల నిధులు కేటాయిస్తామని మంత్రి తెలిపారు. కైటెక్స్ కంపెనీ రూ.1,700కోట్ల వ్యయంతో టీ షర్టుల ఉత్పత్తి చేపట్టిందని, ఈ కంపెనీ పూర్తిస్థాయిలో ఉత్పత్తి ప్రారంభిస్తే 12,500మందికి ఉపాధి లభిస్తుందన్నారు. ఎవర్‌టాప్ టెక్స్ అనే కంపెనీ కోరియాకు చెందిన యంగ్‌వన్‌తో కలిసి రూ.1,100కోట్ల పెట్టుబడి పెట్టిందని, ఈ కంపెనీ ద్వారా 11వేల మందికి ఉపాధి లభిస్తుందన్నారు. అలాగే కేరళకు చెందిన గణేషా కంపెనీ కూడా రూ.11వేల పెట్టుబడిలు పెట్టిందన్నారు. ఇంకా కొత్తగా మరికొన్ని కంపెనీలు రానున్నాయని అన్నారు. ఈ పార్కులో మౌళిక సదుపాయలు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్దంగా ఉందన్నారు. త్వరలోనే ప్రధానమంత్రి నరేంద్రమోదీతో భూమి పూజ చేయిస్తామని కిషన్‌రెడ్డి తెలిపారు.

ఏప్రిల్ వరకు పత్తి కొంటాం

దేశంలో అత్యధికంగా తెలంగాణ నుంచే గత ఏడాది 41లక్షల బేళ్ల పత్తిని కొనుగోలు చేశామని మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. ఈఏడాది కూడా ఇప్పటి వరకు అత్యధికంగా తెలంగాణ నుంచే కొనుగోలు చేస్తున్నామన్నారు. గత ఏడాది 110 కొనుగోలు కేంద్రాలు ఉంటే, ఈసారి 123కు పెంచామన్నారు. తెలంగాణ రైతుల నుంచి పత్తి కొనుగోలు కోసం రూ.60వేల కోట్ల ఎంఎస్‌పీ చెల్లించామని తెలిపారు. ఏడు క్వింటాల్ కంటే ఎక్కువ దిగుబడి వస్తే, సంబంధిత మండల వ్యవసాయ అధికారితో ధృవీకరణ పత్రం తీసుకుంటే సరిపోతుందన్నారు. రైతులు సీసీఐ నిబంధనల ప్రకారమే పత్తిని తేమ లేకుండా తీసుకవస్తున్నారని అన్నారు. మార్చి, ఏప్రిల్ వరకు సీసీఐ పత్తి కొనుగోళ్లు చేస్తుందని, రైతులు దళారులను ఆశ్రయించకుండా సీసీఐ కొనుగోలు కేంద్రాల్లోని పత్తిని విక్రయించాలని మంత్రి కిషన్‌రెడ్డి కోరారు.

కార్యక్రమాల్లో దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ, ఆర్‌వీఎన్‌ఎల్ చీఫ్ ప్రాజెక్టు మేనేజర్ పీవీ.సాయి ప్రసాద్, నగర కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, మాజీ ఎమ్మెల్యేలు అరూరి రమేష్, ధర్మారావు, వన్నాల శ్రీరాములు, బీజేపీ హనుమకొండ, వరంగల్ జిల్లా అధ్యక్షులు సంతోష్, గంట రవికుమార్, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, రావు పద్మ, డాక్టర్ కాళీ ప్రసాద్, సమ్మిరెడ్డి, జయంత్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్‌కు డిపాజిట్ ఎందుకంటే..

ఆరో వంతు ఓట్లు వస్తేనే సొమ్ము దక్కుతుంది

కేసముద్రం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీతో సహా ఏ ఇతర ఎన్నికలైనా నామినేషన్ వేసే అభ్యర్థి దరఖాస్తుతో పాటు డిపాజిట్ రూపంలో కొంత నగదును చెల్లించాల్సి ఉంటుంది. ఎన్నికల్లో అస్తవ్యస్తంగా అధిక మంది పోటీ చేసేందుకు రాకుండా చిత్తశుద్ధితో ఉన్న నిజమైన అభ్యర్థులే ఉండాలనే ఉద్దేశంతో డిపాజిట్ నిబంధనను ఏర్పాటు చేశారు. సెక్యూరిటీ డిపాజిట్ లేదా నామినేషన్ ఫీజును సాధారణ భాషలో 'డిపాజిట్' అని పిలుస్తారు. సర్పంచ్ స్థానానికి పోటీచేసే ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులైతే రూ.1000, జనరల్ అభ్యర్థి అయితే రూ.2000 చెల్లించాల్సిఉంటుంది. వార్డు సభ్యుని స్థానానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు రూ.250, జనరల్ అభ్యర్థులు రూ.500 చెల్లించాల్సి ఉంటుంది. ఈ డిపాజిట్ దక్కితేనే పోటీ చేసి పరువు నిలబెట్టుకున్నట్లుగా గ్రామాల్లో భావిస్తారు. ఈ కారణంగానే అసలైన అభ్యర్థులే ఎన్నికల్లో పోటీకి నిల్చునేందుకు ముందుకు వస్తుంటారు.

డిపాజిట్ తిరిగి పొందాలంటే..

నామినేషన్ వేసిన అభ్యర్థి చెల్లించిన డిపాజిట్ డబ్బులను సదరు నామినేషన్ తిరస్కరణకు గురైనా, ఉపసంహరించుకున్న సందర్భంలో తిరిగి ఇస్తారు. నామినేషన్ పరిగణలోకి తీసుకొని ఎన్నికలు నిర్వహిస్తే ఆయన పోటీ చేసిన స్థానంలో పోలైన ఓట్లలో చెల్లుబాలు అయ్యే వాటిలో ఆరోవంతు (16.67 శాతం) ఓట్లు అభ్యర్థికి వస్తే ఆ అభ్యర్థికి డిపాజిట్ తిరిగి ఇస్తారు. ఉదాహారణకు ఒక గ్రామంలో చెల్లుబాటు అయ్యే ఓట్లు 600 ఉంటే అభ్యర్థికి అందులో ఆరో వంతు అనగా 100 ఓట్లు రావాల్సి ఉం టుంది. అభ్యర్థి గెలుపుఓటములతో సంబంధం లేకుండా ఆరోవంతు ఓట్లు వస్తే డిపాజిట్ డబ్బులు తిరిగి ఇస్తారు. లేదంటే డిపాజిట్ కోల్పోతారు. దీన్నే 'డిపాజిట్ గల్లంతు' అని కూడా పిలుస్తుంటారు.

పంచాయతీ ఎన్నికలపై 5 ఫిర్యాదులు

వరంగల్ కలెక్టరేట్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో వరంగల్ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌కు శనివారం వరకు ఐదు ఫిర్యాదులు వచ్చాయి. వాటిలో మూడు ఓటర్ ఐడీకి సంబంధించినవి కాగా వెంటనే పరిష్కారం కోసం సంబంధిత తహసీల్దార్ కార్యాలయానికి బదిలీ చేశారు.

మరో రెండు ఫిర్యాదులను అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు చేశారు. వీరు ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగం చేస్తూనే పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయవచ్చా అనే సందేహాన్ని వ్యక్తం చేశారు. దీనిపై హెల్ప్ డెస్క్ సిబ్బంది స్పందిస్తూ.. ఎన్నికల్లో పోటీ చేయాలంటే ముందుగా వీరు ఉద్యోగానికి రాజీనామా చేయాలని స్పష్టం చేశారు. పంచాయతీ ఎన్నికల నియమావళి, ఓటింగ్ ప్రక్రియ, అభ్యర్థిత్వాలపై ప్రజల్లో ఉన్న సందేహాలను నివృత్తి చేసేందుకు కలెక్టరేట్ హెల్ప్‌డెస్క్ చురుగ్గా పని చేస్తోంది.

ఓరుగల్లు నాట్యానికి వన్నెలద్దారు..

- వేలాది మందికి నాట్యంలో శిక్షణ ఇచ్చిన వెంపటి నాగేశ్వరి
- ఆమె వారసురాలిగా వెంపటి శ్రావణి తనదైన ముద్ర
- నేడు కాళోజీ కళాక్షేత్రం వార్షిక వేడుకలు

హనుమకొండ కల్చరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆ ఇంటా నృత్య సరాగాలు పల్లవిస్తాయి... అందెల రవళులు ప్రతిధ్వనిస్తాయి.. తెలుగునాట ఓరుగల్లు నృత్య సౌరభాలను దేశ విదేశాల్లో చాటిన ఖ్యాతి ఆ ఇంటికే దక్కుతుంది. కూచిపూడి, భరతనాట్య నృత్య విన్యాసాలను ఎందరికో నేర్పి, ఎందరెందరో కళాకారులను తీర్చిదిద్దిన ఘనత ఆ కళాక్షేత్రానికే దక్కింది. చారిత్రక ఓరుగల్లు నగరంలో ఆరు దశాబ్దాల క్రితం తొలి నృత్య కళాక్షేత్రంగా ప్రారంభమైన వెంపటి వెంకటనారాయణ కాకతీయ నృత్య కళాక్షేత్రం... తన సుదీర్ఘ ప్రయాణంలో 60 వసంతాలు పూర్తి చేసుకున్న వేడుకను వందలాది కళాకారుల మధ్య జరుపుకునేందుకు సన్నద్ధమైంది. హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రం ఆదివారం ఈ వేడుకలకు వేదికగా నిలవనుంది.

లోగో

కూచిపూడి నృత్యాన్ని విశ్వవ్యాప్తం గావించి, కూచిపూడి త్రయంగా పేరుగాంచిన త్రిమూర్తుల్లో ప్రథముడు వెంపటి వెంకటనారాయణశాస్త్రి. ఆయన కుమారుడైన కోదండరామశాస్త్రి కూతురైన వెంపటి నాగేశ్వరి... 1967లో వరంగల్ స్టేషన్ రోడ్‌లో ప్రారంభించిన మొట్టమొదటి నాట్య శిక్షణాలయమే కాకతీయ నృత్య కళాక్షేత్రం. నాగేశ్వరి శిష్యరికంలో విద్యారణ్య సంగీత నృత్య కళాశాల ప్రిన్సిపాల్ స్థాయికి ఎదిగిన కుప్పా పద్మజతో పాటు తాడూరి రేణుక, సంధ్యారాణి, గాయత్రి, శైలజ, కవిత తదితర అనేక మంది జాతీయస్థాయి కళాకారులు వెలుగులోకి వచ్చారు.

నాగేశ్వరి స్వయంగా తన కూతురు అయిన శ్రావణికి కూడా నృత్య సరాగాలు నేర్పించారు. ఆమె కూచిపూడి నృత్యంలో పీజీ డిప్లొమా పూర్తి చేయడమే కాక సెంటర్ ఫర్ కల్చరల్ రిసోర్స్ ట్రైనింగ్ ఫెల్లోషిప్ అవార్డుతో పాటు దూరదర్శన్‌లో బీ గ్రేడ్ కళాకారిణిగాను గుర్తింపు పొందారు. నాగేశ్వరి వేల మంది శిష్యులను తయారు చేసి ఓరుగల్లు ఖ్యాతిని నృత్య రంగంలో నిలిపారు. 2014లో నాగేశ్వరి మృతి చెందిన తర్వాత.. ఆమె కూతురైన శ్రావణి నాట్య రంగంలో వెంపటి వారి తరఫున నాల్గవ వారసురాలిగా బాధ్యతలు స్వీకరించి నాట్యాచారిణిగా చిన్నారులను తీర్చిదిద్దుతూ ఓరుగల్లు ప్రతిభను చాటుతున్నారు.సన్ని, మౌనిక, అక్షిత, నాగర్ల, కౌశిక, రియా తదితర అనేక మంది జాతీయస్థాయిలో అవార్డులు, బహుమతులు సాధించిన కళాకారులు శ్రావణి శిష్యులే కావడం గమనార్హం.


నాట్యాచారిణి వెంపటి శ్రావణి

ఈ కళాక్షేత్రంలో ఇప్పటికి 300 మందికి పైగా, నాలుగేళ్ల వయస్సు నుంచి 30 ఏళ్ల వరకు ఉన్న వారంతా శిక్షణ పొందుతున్నారు. కాళోజీ కళాక్షేత్రంలో ఆదివారం 60వ వెంపటి కాకతీయ కళాక్షేత్రం వార్షికోత్సవాన్ని అట్టహాసంగా జరుపుకునేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు శాంతికృష్ణ చెప్పారు. ఆర్యవైశ్య నాయకులు గట్టు మహేశ్‌బాబు సౌజన్యం, భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు.



రిటర్నింగ్ అధికారుల పాత్ర కీలకం

అదనపు కలెక్టర్ సంపత్‌రావు

ములుగు కలెక్టరేట్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణలో రిటర్నింగ్ అధికారుల పాత్ర కీలకమని అదనపు కలెక్టర్ సంపత్‌రావు అన్నారు కలెక్టరేట్ సమావేశ మందిరంలో పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమం శనివారం జరగ్గా ఆయన మాట్లాడారు. రిటర్నింగ్ అధికారులు ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా కార్యదీక్షతో విధులు నిర్వర్తించాలని, ప్రతి విషయంలో అత్యంత జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈసందర్భంగా రిటర్నింగ్ అధికారులు నిర్వర్తించాల్సిన విధులు, బాధ్యతలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించి వారి సందేహాలను నివృత్తి చేశారు. ప్రతి మండలంలోని పం చాయతీలను క్లస్టర్లుగా ఏర్పాటు చేసి ఒక రిటర్నింగ్ అధికారిని, సహాయ రిటర్నింగ్ అధికారిని నియమించామని అన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం సూచించిన మార్గద ర్శకత్వాలను రిటర్నింగ్ అధికారుల కరదీపికలో సవివరంగా ఉన్నాయని, వాటిని క్షుణ్ణంగా అవగాహన చేసుకుని దానిక నుగుణంగా విధులు నిర్వర్తించాలని అన్నారు. రిటర్నింగ్ అధి కారులు ఎన్ని కల నిర్వహణ నియమావళి ప్రకారం ఎన్నికల నోటీసు ఇవ్వాలని, నామినేషన్ల పేపర్ల స్వీకరణ, రిట్నంగ్ అధికారి కార్యాలయం నోటీస్‌బోర్డుపై స్వీకరించిన అభ్యర్థుల నామినేషన్ పత్రాల జాబితా, స్వీయ ప్రకటన ప్రతులను ప్రచురించాలని, నామినేషన్ పత్రాల పరిశీలన, ఏదేని నామి నేషన్ పత్రాన్ని తిరస్కరిస్తే దానికి కారణం తెలపాలని పేర్కొన్నారు. నామినేషన్ పత్రాల జాబితా ప్రచురించాలని, అభ్యర్థుల ఉపసంహరణ నోటీసు స్వీకరించాలని, పోటీచేసే జాబితా, గుర్తుల కేటాయింపును ప్రతిరోజు పర్యవేక్షించాలని, ఎన్నికల నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచి ఫలితాలు ప్రకటించే వరకు ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉంటుందని అన్నారు. ఏరోజుకా రోజు టీపోల్ సాఫ్ట్‌వేర్‌లో ఆర్‌వోలు, నివేదికలను ఎన్నికల ప్రాసెస్ మాడల్‌ను ఉంచాలన్నారు. శిక్షణ కార్యక్రమంలో రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులు, మాస్టర్ ట్రెయినర్లు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సంపత్‌రావు

ప్రజాస్వామ్యబద్ధంగా పంచాయతీ ఎన్నికలు

కలెక్టర్ టి.ఎస్.దివాకర

ములుగు కలెక్టరేట్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలు ప్రజాస్వామ్య బద్ధంగా నిర్వహిస్తామని, ఇందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కలెక్టర్ టి.ఎస్.దివాకర శనివారం ఒక ప్రకటనలో కోరారు. సర్పంచ్, వార్డుసభ్యుల పదవులను వేలం వేయడం వంటి చర్యలకు ఎవరైనా పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నిక లను పూర్తిగా స్వేచ్ఛాయుతంగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించడం రాష్ట్ర ఎన్నికల ప్రధాన లక్ష్యమని తెలిపారు. నామినేషన్ సమయంలో బెదిరింపులు, దౌర్జన్యాలు, లంచాలు, సర్పంచ్, వార్డుసభ్యుల పదవులకు ఏకగ్రీవాలకు వేలం వంటి అనైతిక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భారత శిక్షాస్మృతిలోని సెక్షన్ 171-ఏ ప్రకారం ఎన్నికల్లో అక్రమ ప్రవర్తనలు, సెక్షన్ 171-బీ ప్రకారం లంచగొండితనం, సెక్షన్ 171-సీప్రకారం ఓటర్లపై అనుచిత ప్రభావం లేదా బెదిరింపులు ఎన్నికల నేరాలుగా పరిగణించబడతాయని పేర్కొన్నారు. సెక్షన్ 171-ఈ, 171-ఎఫ్ ప్రకారం ఒక సంవత్సరం జైలుశిక్ష, జరిమాన విధించొచ్చని, అలాగే నైతిక చర్యలకు పాల్పడినవారు ఆరు సంవత్సరాలపాటు ఎన్నికల్లో పోటీచేసేందుకు అనర్హులు అవుతారని వివరించారు. అలాగే సంబంధిత ఎన్నికల అధికారులు ఇలాంటి చర్యలపై నిఘా ఉంచాలన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం సూచనలను కచ్చితంగా అమలు చేయాలని సంబంధిత అదికారులను కలెక్టర్ ఆదేశించారు. గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఓటర్లు భయపడకుండా ఎటువంటి ప్రలోభాలకు గురికాకుండా తమ ఓటుహక్కును స్వేచ్ఛగా విని యోగించుకునేందుకు జిల్లా ఎన్నికల యంత్రాంగం అన్ని చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు.

కొత్తపల్లిగోరి మండలంలో రెండు పంచాయతీలు ఏకగ్రీవం

రేగొండ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి జిల్లా కొత్తపల్లిగోరి మండలంలో రెండు గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. ఈ మండలంలో బాలయ్యపల్లి, చెంచుపల్లి గ్రామ పంచాయతీలు ఉండగా వీటికి మొదటి విడత ఎన్నికలు జరుగుతున్నాయి. నామినేషన్ పర్వం ముగిసిన నాటికి (శనివారం) రెండింటికి సర్పంచ్ అభ్యర్థులుగా ఒకొక్కరు మాత్రమే నామినేషన్ దాఖలు చేశారు. బాలయ్యపల్లికి తొట్ల తిరుపతి, చెంచుపల్లికి జెల్ల రాంబాబు సర్పంచ్ అభ్యర్థులగా నామినేషన్ దాఖలు చేశారు. అలాగే బాలయ్యపల్లిలో నాలుగు, చెంచుపల్లిలో నాలుగు వార్డు సభ్యుల స్థానాలు ఉండగా వీటికి కూడా ఒకొక్కటి మాత్రమే నామినేషన్లు దాఖలయ్యాయి. ఈ రెండు పంచాయతీల సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులందరినీ కాంగ్రెస్ బలపరుస్తుండగా ఈ స్థానాలకు మరెవరూ నామినేషన్ దాఖలు చేయకపోవడంతో ఇవి ఏకగ్రీవం కావడానికి మార్గం సుగమమైంది.


తొట్ల తిరుపతి


జెల్ల రాంబాబు

రోడ్డు పనులు ప్రారంభం

మల్హర్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన తాడిచర్లలోని కోమటికుంట కట్టపై నుంచి ఎర్రగుంట వరకు రోడ్డు పనులను శనివారం ప్రారంభించారు. కొద్ది రోజుల క్రితం కోమటి కుంట చెరువు ఆయకట్టు రైతులు ఏఎమ్మార్ మైన్ ప్రెసిడెంట్ ప్రభాకర్‌రెడ్డిని కలిసి చెరువు కట్ట మరమ్మతులతో పాటు రోడ్డు నిర్మాణం చేపట్టాలని వినతిపత్రం సమర్పించారు. రోడ్డు పనులను ప్రారంభించడంతో ఆయకట్టు రైతు లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎమ్మార్ ప్రతినిధులు ఎస్‌వో సురేష్‌బాబు, రామచంద్రమూర్తి, సీఎస్ఆర్ సూపర్‌వైజర్లు బొబ్బిలి నరేష్, నారమల్ల నరేష్, రజాక్, రైతులు ఆగయ్య, కిరణ్ కుమార్, నరేష్, సురేష్, లింగారావు, అశోక్ రావు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన

కాటారం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): స్త్రీ హింస, బాల్య వివాహాల నిర్మూలనపై స్థానిక గిరిజన సంక్షేమ బాలికల గురుకులంలో విద్యార్థినులకు, మండల కేంద్రంలోని అయ్యప్ప కల్యాణ మండపంలో అంగన్‌వాడీ టీచర్లకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జెండర్ స్పెసలిస్ట్ అనూష మాట్లాడుతూ లింగ వివక్ష పాటించడం, బాల్య వివాహాలు చేయడం నేరమన్నారు. బేటీ బచావో-బేటీ పడావో, బాలికల విద్యా రక్షణ, 1098, 1930, 112టోల్‌ఫ్రీ నెంబర్లపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గురుకులం ప్రిన్సిపాల్ నాగలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివరాణి, డీహెచ్‌ఈడబ్ల్యూ, సఖి, సీహెచ్ఎల్ విభాగాల ప్రతినిధులు అనూష, మాధవి, ఏడబ్ల్యూటీలు తదిత రులు పాల్గొన్నారు.

● చిట్యాల (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జూకల్లు, చల్లగరిగ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో తెలంగాణ సాంస్కృతిక సారిథి బృందం ద్వారా బాల్యా వివాహాల నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కళాకారుడు మైన ఎల్లన్న నేతృత్వంలో బేటీ బచావో.. బేటి పడావోపై వివరించారు. బాల్యవివాహాల మూలంగా బాలికలకు ఎదురయ్యే అనర్థాలపై ఆటాపాటలతో అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యా యులు ఝాన్సీ, గిరగాని కృష్ణ, ఉపాధ్యాయులు, కళాకారులు దుప్పటి రవి, ఖలీల్, స్వప్న, శ్యామల, రజిత తదితరులు పాల్గొన్నారు.

భారీగా నామినేషన్లు

- మొదటి విడతలో చివరి రోజు అత్యధికంగా దాఖలు
- సర్పంచ్ స్థానాలకు 275, వార్డుల మెంబర్లకు 913
- ఆలస్యంగా కొనసాగిన ప్రక్రియ

ములుగు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 146 గ్రామ పంచాయతీలు, 1290 వార్డులకు మూడు దశల్లో ఎన్నికలు నిర్వహించేందుకు అధికార యంత్రాంగం ప్రణాళికలు చేసింది. ఈ క్రమంలో మొదటి దశ నామినేషన్ల స్వీకరణ ఈ నెల 27 న ప్రారంభమై 29న ముగిసింది. మొదటి విడుతలో భాగంగా గోవిందరావుపేట, ఏటూరునాగారం, తాడ్వాయి మండ లాల్లోని 48 జీపీలు, 420 వార్డుల నుంచి సర్పంచ్, వార్డు సభ్యుల పదవులకు నామినేషన్లు స్వీకరించారు. ఈ క్రమంలో శనివారం భారీగా నామినేషన్లు దాఖలయ్యాయి. మూడు మండలాల నుంచి గురు, శుక్రవారాల్లో నామినేషన్లు అంతంత మాత్రంగానే వచ్చినప్పటికీ చివరి రోజు భారీ సంఖ్యలో దాఖల య్యాయి. మొదటి దశ నామినేషన్ల ప్రక్రియ పూర్తికావడంతో రెండో దశ ఎన్ని కల నామినేషన్ల ప్రకియను మొదలు పెట్టేందుకు అధికారులు సిద్ధమయ్యారు.

మూడు రోజుల్లో నామినేషన్లు ఇలా....

పంచాయతీ ఎన్నికల కోసం చేపట్టిన నామినేషన్ల మొదటి విడత ప్రక్రియ శనివారం ముగిసింది. మొదటి రోజు మూడు మండలాల్లో సర్పంచ్ స్థానాలకు 22, వార్డు సభ్యుల స్థానాలకు 20 నామినేషన్లు దాఖలయ్యాయి. రెండో రోజు సర్పంచ్ స్థానాలకు 41 నామినేషన్లు రాగా, వార్డు మెంబర్లకు 73 నామినేషన్లు వచ్చాయి. చివ రి రోజు ఎక్కువ మొత్తంలో నామినేషన్లు పడ్డాయి. మొత్తంగా గోవిందరావుపేట, తాడ్వాయి, ఏటూరునాగారం మండలాల నుంచి 1,188 నామినేషన్లు దాఖలు అయ్యాయి.

చివరి రోజు మండలాల వారీగా..

తాడ్వాయి, ఏటూరునాగారం, గోవిందరావుపేట మండలాలలో పంచాయతీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణకు ఆఖరి రోజు కావడంతో ఎక్కువ మొత్తంలో నామినేషన్లు దాఖలు అయ్యాయి. శనివారం ఏటూరునాగారం మండంలోని ఏటూరునాగారం మేజర్ జీపీలో సర్పంచ్ 7, వార్డు మెంబర్ 56 నామినేషన్లు వచ్చాయి. రొయ్యూరు జీపీలో సర్పంచ్ పదవికి 7, వార్డు మెంబర్‌కు 27 నామినేషన్లు, చల్పాక జీపీలో సర్పంచ్ పదవికి 6, వార్డు మెంబర్‌కు 19, అల్లంవారి ఘనపూర్ జీపీలో సర్పంచ్ పదవికి 2, వార్డు మెంబర్‌కు 7, రామన్నగూడెం జీపీలో సర్పంచ్ పదవికి 6, వార్డు మెంబర్‌కు 19, కోయగూడెం ఎల్లాపూర్ (రాంనగర్) జీపీలో సర్పంచ్ పదవికి 4, వార్డు మెంబర్‌కు 13, శంకరాజుపల్లి జీపీలో సర్పంచ్‌కు 4, వార్డు మెంబర్‌కు 10, ముళ్లకట్ట జీపీలో సర్పంచ్ పదవికి 5, వార్డు మెంబర్‌కు 18, చిన్నబోయినపల్లి జీపీలో సర్పంచ్ పదవికి 4, వార్డు మెంబర్‌కు 27, కొండాయి జీపీలో సర్పంచ్ పదవికి 4, వార్డు మెంబర్‌కు 22, షాపల్లి జీపీలో సర్పంచ్ పదవికి 2 వార్డు మెంబర్‌కు 20, శివాపూర్ జీపీలో సర్పంచ్ పదవికి 4, వార్డు మెంబర్‌కు 18 నామినేషన్లు వచ్చాయి.

గోవిందరావు పేట మండలంలోని మచ్చాపూర్ జీపీలో సర్పంచ్ పదవికి 4 వార్డు మెంబర్‌కు 17, బుస్సాపూర్ జీపీలో సర్పంచ్ పదవికి 4 వార్డు మెంబర్‌కు 14, చల్వాయి జీపీలో సర్పంచ్ పదవికి 7వార్డు మెంబర్‌కు 42, గోవిందరావుపేట జీపీలో సర్పంచ్ పదవికి 8 వార్డు మెంబర్‌కు 39, సోమలగడ్డ జీపీలో సర్పంచ్ పదవికి 6 వార్డు మెంబర్‌కు 7, రంగాపూర్ జీపీలో సర్పంచ్ పదవికి 2 వార్డు మెంబర్‌కు 10, కోట గడ్డ జీపీలో సర్పంచ్ పదవికి 1 వార్డు మెంబర్‌కు 9, లక్నవరం జీపీలో సర్పంచ్ పదవికి 6 వార్డు మెంబర్‌కు 18, పస్రా జీపీలో సర్పంచ్ పదవికి 6 వార్డు మెంబర్‌కు 47, లక్ష్మీపురం జీపీలో సర్పంచ్ పదవికి 5 వార్డు మెంబర్‌కు 26, కర్లపల్లి జీపీలో సర్పంచ్ పదవికి 2 వార్డు మెంబర్‌కు 13, మొట్లగూడెం జీపీలో సర్పంచ్ పదవికి 5 వార్డు మెంబర్‌కు 9, ముత్తాపూర్ జీపీలో సర్పంచ్ పదవికి 3 వార్డు మెంబర్‌కు 12 నామినేషన్లు, రాఘవపట్నం జీపీలో సర్పంచ్ పదవికి 4 వార్డు మెంబర్‌కు 14, రాంనగర్ జీపీలో సర్పంచ్ పదవికి 7 వార్డు మెంబర్‌కు 17, పాపయ్యపల్లి జీపీలో సర్పంచ్ పదవికి 1 వార్డు మెంబర్‌కు 3, గాంధీనగర్ జీపీలో సర్పంచ్ పదవికి 5 వార్డు మెంబర్‌కు 13, బాలాజీ నగర్ జీపీలో సర్పంచ్ పదవికి 3 వార్డు మెంబర్‌కు 14 నామినేషన్లు పడ్డాయి.

తాడ్వాయి మండలంలోని తాడ్వాయి జీపీలో సర్పంచ్ పదవికి 3వార్డు మెంబర్‌కు 15 నామినేషన్లు వచ్చాయి. కాటాపూర్ జీపీలో సర్పంచ్ పదవికి 5 వార్డు మెంబర్‌కు 14, నర్సాపూర్ జీపీలో సర్పంచ్ పదవికి 3వార్డు మెంబర్‌కు 26, దామరవాయి జీపీలో సర్పంచ్ పదవికి 3 వార్డు మెంబర్‌కు 10, పంబాపూర్ జీపీలో సర్పంచ్ పదవికి 4 వార్డు మెంబర్‌కు 5, బీరెల్లి జీపీలో సర్పంచ్ పదవికి 2 వార్డు మెంబర్‌కు 14, రంగాపూర్ జీపీలో సర్పంచ్ పదవికి 4 వార్డు మెంబర్‌కు 15, అంకంపల్లి జీపీలో సర్పంచ్ పదవికి 2 వార్డు మెంబర్‌కు 5 నామినేషన్లు వచ్చాయి. మేడారం జీపీలో సర్పంచ్ పదవికి 5 వార్డు మెంబర్‌కు 20, . ఊరట్టం జీపీలో సర్పంచ్ పదవికి 4వార్డు మెంబర్‌కు 15, కాల్వపల్లి జీపీలో సర్పంచ్ పదవికి 6 వార్డు మెంబర్‌కు 19, బయ్యక్కపేట జీపీలో సర్పంచ్ పదవికి 3 వార్డు మెంబర్‌కు 10 నామినేషన్లు వచ్చాయి. వెంగళాపూర్ జీపీలో సర్పంచ్ పదవికి 3 వార్డు మెంబర్‌కు 16, లింగాల జీపీలో సర్పంచ్ పదవికి 3 వార్డు మెంబర్‌కు 8, బందాల జీపీలో సర్పంచ్ పదవికి 4 వార్డు మెంబర్‌కు 12, నార్లాపూర్ జీపీలో సర్పంచ్ పదవికి 8 వార్డు మెంబర్‌కు 26 నామినేషన్లు వచ్చాయి. కామారం జీపీలో సర్పంచ్ పదవికి 8 వార్డు మెంబర్‌కు 11, గంగారం జీపీలో సర్పంచ్ పదవికి 8 వార్డు మెంబర్‌కు 14 నామినేషన్లు వచ్చాయి.

నేటి నుంచి రెండో విడత ప్రారంభం

రెండో విడత ఎన్నికలు ములుగు, జేడీ మల్లంపల్లి, వెంకటాపూర్ మండలాల్లో జరగనున్నాయి. ఈ మండలాలలోని 52 గ్రామ పంచాయతీలు, 462 వార్డులకు నామినేషన్ల స్వీకరణ ఆదివారం ప్రారంభం కానుంది. 52 జీపీలు,462 వార్డుల్లో ములుగు మండలం నుంచి 19 గ్రామ పంచాయతీలు 172 వార్డులు ఉన్నాయి. జేడీ మల్లంపల్లి మండలం నుంచి 10 జీపీలు, 90 వార్డులు ఉన్నాయి. వెంకటాపూర్ మండలం నుంచి 23 జీపీలలో 200 వార్డులు ఉన్నాయి. ఈ మండలాల పరిధిలో సర్పంచ్, వార్డు సభ్యులుగా పోటీ చేయాలనుకునే అభ్యర్థులు ఈ నెల 30 (ఆదివారం) నుంచి డిసెంబరు 2వరకు నామినేషన్లు దాఖలు చేసుకోవచ్చు.

రామప్ప ఆలయంలో విద్యార్థుల సందడి

వెంకటాపూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామప్ప దేవాలయంలో శనివారం విద్యార్థులు సందడి చేశారు. రామలింగేశ్వర స్వామిని దర్శించుకొని పూజారుల నుంచి తీర్థప్రసాదాలు అందుకున్నారు. అనంతరం తూర్పు ముఖద్వారంలో ఉన్న నందీశ్వరుడి చుట్టూ ప్రదక్షిణలు చేసి ఆలయ శిల్పకళా సంపదను వీక్షించారు. ఆలయ చరిత్ర, విశిష్టతను గైడ్లను అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి సరస్సు వద్దకు చేరుకుని బోటులో విహరిస్తూ ప్రకృతి అందాలను ఆస్వాదించారు.

నేడు విద్యుత్ సరాఫరాకు అంతరాయం

మంగపేట నవంబరు29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అకినేపల్లి మల్లారం ఉప విద్యుత్ కేంద్రం పరిధిలోని గ్రామాల్లో ఆదివారం విద్యుత్ సరాఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ కృష్ణారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉప విద్యుత్ కేంద్రంలో చేపడుతున్న మరమ్మతు పనుల కారణంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరాఫరాలో అంతరాయం ఉటుందని పేర్కొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటాలి

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్


కార్యకర్తలతో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్

ములుగు రూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్ అన్నారు. మండలంలోని జగ్గన్నపేట గ్రామంలో కాంగ్రెస్ జిల్లా ప్రచార కార్యదర్శి నూనేటి శ్యామ్ యాదవ్ ఆధ్వర్యంలో శనివారం ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన రవి చందర్ మాట్లాడారు. మంత్రి సీతక్క స్వంత గ్రామమైన జగ్గన్నపేట గ్రామంలో జరిగే సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించి మంత్రి సీతక్కకు ప్రత్యేక బహుమతిగా అందించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చింతనిప్పుల భిక్షపతి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లెల్ల భరత్ కుమార్, బీసీసెల్ జిల్లా అధికార ప్రతినిధి గుంద్రత్ జయాకర్, జిల్లా నాయకులు లక్కీ, అర్రెం వెంకన్న, పట్టణ యూత్ అధ్యక్షుడు అబినయ్ చారి, యూత్ నాయకులు గూడెపు రాకేష్, పార్టీ గ్రామ అధ్యక్షుడు ముత్తినేని సదానందం పాల్గొన్నారు.

పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలి : బీఆర్ఎస్

వెంకటాపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంపా రాంబాబు కోరారు. మండల కేంద్రంలో శనివారం జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పంచాయతీ ఎన్నికల్లో పార్టీ బలపరిచిన అభ్యర్థుల విజయానికి శక్తివంచన లేకుండా పనిచేయాలన్నారు. బీఆర్ఎస్ హయాంలోనే గ్రామాలు అభివృద్ధిచెందాయని అన్నారు. ఈసమావేశంలో నాయకులు గుడవర్తి నర్సింహమూర్తి, చిడెం రవికుమార్, డర్రా దామోదర్, వేల్పూరి లక్ష్మీనారాయణ, జాగర శాంతమూర్తి, గడ్డం వివేక్, పెనుమచ్చ మాధురి, పూనెం శ్రీదేవి, ముదుంబ శ్రీనివాస్ పాల్గొన్నారు.

దివ్యాంగులు సంఘాలు ఏర్పాటు చేసుకోవాలి

ములుగు టౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు సంఘాలు ఏర్పాటు చేసుకోవడానికి ముందుకు రావాలని సంక్షేమ శాఖ జిల్లా అధికారి తుల రవి అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ములుగులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో జిల్లా మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వయో వృద్ధులు, ట్రాన్స్ జెండర్ల సాధికారత సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు శనివారం జరిగాయి. ముఖ్య అతిథులుగా సంక్షేమ జిల్లా అధికారి తుల రవితోపాటు డీఆర్‌డీవో శ్రీనివాస్ హాజరయ్యారు. దివ్యాంగులను సంఘటితం చేసి వారు తమ సమస్యలను చర్చించుకోవడానికి, సాధికారత వైపు నడిపించడానికి క్షేత్ర స్థాయిలో నూతన సంఘాలు ఏర్పాటు చేసుకొనేలా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దబోయిన శ్రీనివాస్, పీఆర్‌టీపీ డీపీఎం భవాని, దివ్యాంగుల సంక్షేమ సంఘం ఇన్‌చార్జి నాగేంద్ర, డీఐసీపీవో ఓంకార్, ఎఫ్ఆర్‌వో గణేష్, డీఎంసీ రమాదేవి, సఖి సీఏ లావణ్య పాల్గొన్నారు.

అభ్యర్థులు జాగ్రత్తలు పాటించాలి

వెంకటాపూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికల్లో నామినేషన్ వేసే అభ్యర్థులు ఎలాంటి పొరపాట్లు జరుగకుండా జాగ్రత్తలు పాటించాలని తహసీల్దార్ గిరిబాబు, ఎస్సై చల్ల రాజు, ఎంపీడీవో మూడ్ రాజునాయక్ సూచించారు. నామినేషన్ దాఖలుపై స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో పలు సూచనలు చేశారు. నామినేషన్‌తోపాటు ఇద్దరు సాక్షులతో సెల్ఫ్ డిక్లరేషన్ దాఖలు చేయాలని, ఎవరైనా అభ్యర్థి నామినేషన్‌తోపాటు సెల్ఫ్ డిక్లరేషన్‌ను దాఖలు చేయడంలో విఫలమైతే అతను నామినేషన్ వేసే చివరితేదీ సాయంత్రం 5గంటలలోపు దాఖలు చేయాలన్నారు. పోస్టల్, బ్యాంకుఖాతా లేదా ఇతర బ్యాంకులలో ఖాతాలు ఉన్నా నామినేషన్ వేసే అభ్యర్థి నూతన బ్యాంకు ఖాతా తప్పకుండా తీసుకోవాలన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ మాజీ ఎంపీటీసీలు

చిట్యాల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ తాజా మాజీ ఎంపీటీసీలు శనివారం కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు జంబుల తిరుపతి, చిట్యాల మాజీ ఎంపీటీసీ కట్కూరి పద్మనరేందర్‌కు స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యానారాయణరావు సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ గుమ్మడి శ్రీదేవి, జిల్లా ప్రధాన కార్యదర్శి మధు వంశీకృష్ణ, మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి, మాజీ జడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, జిల్లా నాయకులు దొడ్డి కిష్టయ్య, రాయకొంరు, యూత్ మండల అధ్యక్షుడు కుమార్, పట్టణ అధ్యక్షుడు బుర్ర లక్ష్మణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కుల మతాలకు అతీతంగా సమాన హక్కులు

భూపాలపల్లిటౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగంలో కులమ తాలకు అతీతంగా అందరికీ సమాన హక్కులు ఉంటాయని భూపాలపల్లి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రామస్వామి అన్నారు. శనివారం భూపాలపల్లి పట్టణంలోని గడ్డిగానిపల్లిలో పౌరహక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగంలో ప్రతి పౌరుడికీ హక్కులు పొందుపర్చారని అన్నారు. చట్టం ప్రకారం మానవ గౌరవం అందరికీ ఒకేలా ఉండాలని అన్నారు. సమాన రక్షణ కూడా ఉంటుందని తెలిపారు. సామాజిక వివక్షను పారదోలడానికి, ప్రజాస్వామ్య విలువలను కాపాడుకో వడానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ పున్నంచందర్, డీజీవో బండి శ్రీనివాస్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అభ్యర్థులు బ్యాంకు ఖాతా తెరవాలి

కాటారం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తమ ఎన్నికల ఖర్చులను పారదర్శకంగా చూపించడానికి బ్యాం కుల్లో నూతన కరెంట్ ఖాతాలను తెరుచుకోవాలని ఎంపీడీవో బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఖాతా ఉన్న బ్యాంకులో లేదా ఏ ఇతర బ్యాంకులోనైనా ఖాతా తీసుకోవచ్చని ఎన్నికల సంఘం తెలియజేసిందని పేర్కొన్నారు. అభ్యర్థులు తప్పని సరిగా నూతన ఖాతా సమాచారాన్ని తెలియ జేయాల్సి ఉంటుందని తెలిపారు.

టీపీసీసీ చీఫ్‌ను కలిసిన డీసీసీ అధ్యక్షుడు

భూపాలపల్లిటౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన భట్టు కర్ణాకర్ టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను శనివారం కలిశారు. హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. తనకు అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కర్ణాకర్ సతీమణి పాల్గొన్నారు.


మహేష్ కుమార్‌గౌడ్‌తో డీసీసీ అధ్యక్షుడు కర్ణాకర్ తదితరులు

ఘనంగా దీక్షా దివస్

వాజేడు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం కోసం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దీక్ష చేపట్టి 16 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మండలంలోని ప్రగళ్లపల్లిలో ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. నాడు కేసీఆర్ దీక్ష చేపట్టకపోతే ప్రత్యేక రాష్ట్రం వచ్చేది కాదని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పూసం నరేష్, నాయకులు బత్తుల శ్రీను, శంకర్ దయాళ్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

● ఏటూరునాగారం (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సాధన కోసం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేపట్టిన అమరణ నిరాహార దీక్ష స్ఫూర్తిని గుర్తు చేసుకుంటూ మండల కేంద్రంలో శనివారం దీక్షా దివస్ కార్యక్రమాన్ని బీఆర్ఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షుడు గడదాసు సునీల్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకకు ములుగు జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహరావు(లక్ష్మణ్ బాబు) ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా లక్ష్మణ్ బాబు బస్టాండ్‌లోని జయశంకర్, తెలంగాణ తల్లి విగ్రహాలకు పూలమాలలు వేసి, కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం బీఆర్ఎస్ మండల పార్టీ కార్యాలయంలో తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొని, పోరాడిన స్థానిక ఉద్యమకారులను లక్ష్మణ్ బాబు శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు తుమ్మ మల్లారెడ్డి, నూతి కృష్ణమూర్తి, తాడూరి రఘు, సర్దార్ పాషా, ఎమ్డీ. వలీబాబా, తాటి కృష్ణయ్య, కూనూరు అశోక్ గౌడ్, కోనేరు నాగేష్, దడిగల సమ్మయ్య, కర్ర రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి

ఎలక్షన్ అబ్జర్వర్ ఫణీంద్రరెడ్డి

మొగుళ్లపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని ఎన్నికల పరిశీలకుడు ఫణీంద్రరెడ్డి సూచించారు. శనివారం ఆయన మండలంలోని మొగుళ్లపల్లి, రంగాపూర్ గ్రామపం చాయతీలను ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వాహనాన్ని నిశితంగా పరిశీలించాలని అన్నారు. అనంతరం నామినేషన్ కేంద్రాలను పరిశీలించి సౌకర్యాలు, నామినేషన్ల స్వీకరణ విధానాన్ని సమీక్షించారు. ఆర్‌వో, ఏఆర్‌వోలతో మాట్లాడి నామినేషన్ పత్రాల పరిశీలన, రికార్డుల నిర్వహణ, అభ్యర్థులకు అందించే మార్గదర్శకాలపై సూచనలు చేశారు. తదుపరి పోలింగ్ కేంద్రాలను సందర్శించి అవసరమైన ఏర్పాట్లను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో కనీస మౌలిక సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయన ఎంపీడీవో, తహసీల్దార్‌ను ఆదేశించారు. అదేవిధంగా ఎఫ్ఎస్‌టీ బృందాలతో మాట్లాడి ఇప్పటివరకు టీం చేసిన తనిఖీలు, స్వాధీనం చేసుకున్న వస్తువులు, చేపట్టిన చర్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

విత్తన చట్టంపై అవగాహన

వాజేడు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తెచ్చిన విత్తన చట్టంపై రైతులకు, విత్తనాలు, ఎరువుల వ్యాపారులకు మండలంలోని పేరూరు రైతు వేదిక వద్ద శనివారం వ్యవసాయశాఖ అధికారులు అవగాహన కల్పించారు. వాజేడు ఏవో వాజిద్ మాట్లాడుతూ విత్తన చట్టంలోని అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు హరీష్, జాఫర్, రాధిక తదితరులు పాల్గొన్నారు.

● కన్నాయిగూడెం (ఆంధ్రజ్యోతి): విత్తన డీలర్లు నకిలీ, నాణ్యత ప్రమాణాలు లేని విత్తనాలను రైతులకు అమ్మితే చట్టప రంగా కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి ముంజ మహేష్ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేది కలో నూతన విత్తన చట్టం 2025పై రైతు లకు, విత్తన డీలర్లకు అవగాహన కల్పిం చారు. నూతన విత్తన చట్టంతో వస్తున్న మార్పుల గురించి వివరించారు. చట్టంలో తేవాల్సిన మార్పుల గురించి రైతలను అడిగి అభిప్రాయాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో ఏఈవె కల్యాణి తదితరులు పాల్గొన్నారు.